ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 29 జూలై 2024


సంఘటన స్థలంలో బోల్తా పడిన ట్రాక్టర్, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

మొక్కుబడికి వెళ్తుండగా.. ఘోరం

చికిత్స, ఆర్థిక సాయంపై మంత్రి అనగాని ఆదేశాలు

ట్రాక్టర్ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు ఫోన్ చేసి బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని, అవసరమైతే గుంటూరు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళికి సూచించారు. దీంతో జేసీ సుబ్బారావు ఆస్పత్రి వద్దకు వచ్చి ఘటన వివరాలు, బాధితులకు కావాల్సిన వైద్య సహాయంపై వైద్యులతో చర్చించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఘటన బాధాకరమని మంత్రి అనగాని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున, గాయపడినవారికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని మంత్రి సోదరుడు శివప్రసాద్ అందజేశారు.

- ముగ్గురు మృతి.. 11 మందికి తీవ్రగాయాలు
- దమ్మనవారిపాలెం వద్ద ట్రాక్టర్ ట్రక్కు బోల్తా
- గుట్టువారిపాలెంలో విషాదం

బాపట్ల, రేపల్లె, జూలై 28: మొక్కు తీర్చుకోవాలని బంధువులందరూ కలిసి ట్రాక్టర్‌లో బయల్దేరారు. అయితే ఇరుకు రోడ్డులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఘోరం జరిగింది. దైవ దర్శనానికి వెళ్లే ఆనందంలో ఉన్న ముగ్గురు మృతి చెందగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. నగరం మండలం గట్టువారిపాలెం గ్రామానికి చెందిన గట్టు వెంకటేశ్వరమ్మ కొండపాటూరు పోలేరమ్మతల్లికి మొక్కుకుంది. ఈ క్రమంలో ఆమె మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు 20 మందితో కలిసి ట్రాక్టర్‌లో కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మతల్లి గుడికి బయలుదేరారు. వీరి ట్రాక్టర్ కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామ శివారు వచ్చే సరికి బాపట్ల నుంచి రేపల్లె వెళ్తున్న బస్సు ఎదురైంది. ఆ బస్సును తప్పించేందుకు ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు దిగువనకు వెళ్లాడు. దీంతో ట్రాక్టర్ ట్రక్కుతో సహా బోల్తా కొడుతూ ఐదారడుగుల లోతులో ఉన్న పొలాల్లో పడిపోయింది. ట్రక్కులో ఉన్న గట్టు కోటేశ్వరరావు(65), గడ్డం శివనాగులు(60), గడ్డం లక్ష్మి(40) అక్కడికక్కడే మృతి చెందారు. పాలెం శేషమ్మ, ఇమ్మడిశెట్టి నాగలక్ష్మి, పాలెం పుష్పావతి, కాట్రగడ్డ లక్ష్మి, మక్కె రమాదేవి, పాలెం కృష్ణకుమారి, పాలెం సీతామహాలక్ష్మి, పాలెం శివకుమారి, ఇమ్మడిశెట్టి రాఘవమ్మ, పాలెం సుబ్బరావమ్మ, కాట్రగడ్డ సుజాత తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గలకారణాలను డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, సీఐలు శ్రీహరి, హజరత్‌బాబులను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సాయంతో ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందినవారిని బయటకు తీయించారు. క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. పుష్పావతి, కృష్ణకుమారి, రమాదేవి, లక్ష్మిలను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రికి, నాగలక్ష్మిని తెనాలి వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన కోటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె, శివనాగులుకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు, లక్ష్మికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలియడంతో మృతుల బంధువులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో బాపట్ల ఏరియా వైద్యశాల వద్దకు తరలివచ్చారు. దైవదర్శనానికి వెళ్లేందుకు ఉదయం అందరూ ఉత్సాహంగా వెళ్తుండగా గ్రామస్తులు వీడ్కోలు పలికారు. కొద్దిసేపటికే ముగ్గురు మృతి చెందారని, 11 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.


మృతులు గట్టు కోటేశ్వరరావు, లక్ష్మి, శివనాగులు


నిండు కుండలా శ్రీశైలం జలాశయం

బిర బిరా కృష్ణమ్మ

- రెండు రోజుల్లో నిండనున్న శ్రీశైలం
- సాగర్‌కు 77,771 క్యూసెక్కుల ప్రవాహం
- నేడు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తేందుకు ఆదేశాలు
- సాగర్ ఆయకట్టులో పూర్తిగా మారిన సాగు చిత్రం
- ప్రత్యామ్నాయ సాగును తాత్కాలికంగా నిలిపిన రైతులు
- వరి సాగు దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. దీంతో జలకళ సంతరించుకుంది. నాగార్జున సాగర్ జలాశయం దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ డ్యాంకు కూడా రోజురోజుకు వరద పెరుగుతోంది. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 4,41,222 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకు 155.78 టీఎంసీలకు చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 77,771 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలశయానికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో సోమవారం శ్రీశైలం గేట్లు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీశైలానికి వరద పోటెత్తుతుండటంతో సాగర్ ఆయకట్టులో సాగు చిత్రం రెండు రోజుల్లోనే మారిపోయింది. వరి సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీశైలం నిండి సాగర్‌కు నీరు వస్తుందన్న అంచనాతో ప్రత్యామ్నాయ పంటల సాగును తాత్కాలికంగా నిలిపివేశారు. సాగు నీరు వస్తుంది వరి సాగు చేసే అవకాశాలు ఉన్నాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఈ దిశగా సాగు ప్రణాళికను మార్చుకుని వరి సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

శ్రీశైలానికి 173 టీఎంసీల నీరు రాక

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి దిగువకు దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. ఐదు రోజుల్లో శ్రీశైలానికి 123.27 టీఎంసీల నీరు వచ్చింది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న వరద నీటిని లెక్కిస్తే శ్రీశైలానికి దాదాపు ఇంకా 173 టీఎంసీల నీరు వస్తుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే సాగర్‌కు దాదాపు 125 టీఎంసీల వరకు నీరు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాగు నీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 8,212 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వరద వివరాలపై రైతుల ఆసక్తి

ఆల్మట్టి నుంచి నీరు ఎంత విడుదల చేస్తున్నారు.. శ్రీశైలం ఎప్పుడు నిండుతుంది.. ఏ జలాశయానికి ఎంత వరద వస్తుంది.. ఇలా సాగర్ కుడి కాలువ ఆయకట్టు రైతులు ఎప్పటికప్పుడు వరద వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మీడియా, అంతర్జాలం ద్వారా ఆయా వివరాలను గమనిస్తున్నారు. ఏ ఇద్దరు రైతులు కలిసినా జలాశయాలకు వస్తున్న వరద నీటిపై లెక్కలు వేసుకుంటున్నారు. కృష్ణానది బేసిన్‌లో నమోదవుతున్న వర్షపాతం వివరాలను అన్నదాతలు ఆసక్తిగా గమనిస్తున్నారు. సాగర్‌కు ఎంత నీరు వచ్చే అవకాశం ఉందన్న అంశాన్ని కూడా వారు టీఎంసీలలో లెక్కలు కడుతున్నారు. సాగర్‌కు వరద నీరు వస్తుండటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగు నీరు లేక లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారిన నేపథ్యంలో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ ఏడాదైనా సాగు నీరు వస్తుందని ఆశపడుతున్నారు. కృష్ణమ్మ పరవళ్లు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	76.69	2,18,230	2,96,794
నారాయణపూర్	33.31	25.65	2,90,042	3,03,925
జూరాల	9.66	7.63	2,99,432	2,88,424
తుంగభద్ర	105.78	100.52	1,03,676	1,17,691
శ్రీశైలం	215.81	155.78	4,41,222	80,711
నాగార్జున సాగర్	312.05	132.98	53,677	6,344
పులిచింతల	45.77	1.06	50	50

మళ్లీ.. మినీ గోకులాలు


గోకులం పథకం కింద నాడు నిర్మించిన షెడ్

షెడ్ల మంజూరు జిల్లాల వారీగా

జిల్లా	మంజూరైన షెడ్లు
పల్నాడు	700
గుంటూరు	450
బాపట్ల	625

- పశు పోషకులకు ప్రభుత్వ చేయూత
- గతంలోలా షెడ్ల నిర్మాణానికి పచ్చజెండా
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 1,775 షెడ్ల నిర్మాణం
- రాయితీలతో మండలానికి 25 యూనిట్లు మంజూరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాడి పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గేదెలు, జీవాలు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. వాటి పెంపకంలో ప్రధాన ప్రతిబంధకంగా ఉండే షెడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా గతంలోనే టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ మినీ గోకులాల పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలోలా మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. షెడ్ల నిర్మాణంలో పశు పోషకులకు 90 శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం మేర రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మార్గదర్శకాలు జారీ చేశారు. పశు సంవర్థక శాఖ అధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు విడుదల చేయనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు 1,775 షెడ్లను మంజూరు చేశారు. 2018లో టీడీపీ హయాంలో తొలుత మినీ గోకులం పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో విస్తృతంగా మినీ గోకులాలను నిర్మించారు. ఇదే తరహాలో మళ్లీ గోకులం పథకాన్ని చంద్రబాబు ప్రవేశపెట్టారు. పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థికంగా చేయూత అందించే క్రమంలో ఈ పథకాన్ని ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెట్టింది. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకందారులు వారి వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం ఇస్తుంది. తొలి విడతలో మండలానికి 25 యూనిట్లు ఇవ్వాలని నిర్ణయించారు. సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ పోషకులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

నాటి బిల్లులు చెల్లించలేదు

మినీ గోకులం పథకం కింద టీడీపీ హయాంలో రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ బిల్లులను పక్కన పెట్టేశారు. అయితే తాజాగా మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఇప్పటికైనా మోక్షం కలుగుతుందని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాలుగు పశువులు ఉంటే రూ.1.5 లక్షలు, ఆరు పశువులకు రూ.1.8 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. రైతులు అప్పట్లో పనులు ప్రారంభించి నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో మినీ గోకులం బిల్లులు మంజూరు చేయలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్థకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. నిర్మాణాల బిల్లులు చెల్లించాలని పోషకులు పలుమార్లు ఆందోళనలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. అయితే కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి న్యాయం చేస్తుందని రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

పశువుల గోకులం వివరాలు (రూ.లక్షల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 ఉంటే	1,85,000	1,66,500	18,500
6 మించి	230,000	2,07,500	23,000

గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల వివరాలు (రూ.లక్షల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
20 గొర్రెలు, మేకలు	1,31,000	91,000	39,000
50 దాటితే	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200 పైగా ఉంటే	1,32,000	92,000	39,600

"పాడి, జీవాలు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు.., వాటి పోషకులకు చేయూత ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మినీ గోకులాలను ఏర్పాటు చేసి పోషకులను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్స హించారు. ఎక్కడి కక్కడ పాడి పశువులు, జీవాలు, కోళ్ల కోసం షెడ్లను నిర్మించేలా మినీ గోకులాలను మంజూరు చేశారు. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మినీ గోకులాలను విస్మరించింది. దీంతో పోషకులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. అయితే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మినీ గోకులాల పథకాన్ని ప్రవేశ పెట్టి, షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాలకు నిధులు విడుదల చేసేలా ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది."

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

- ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే..

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోసం జోన్-3లో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో విధుల నిర్వహణ కోసం వెళ్లిన తహసీల్దార్లు వెనక్కు రాగా వారికి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వేర్వేరు మండలాల్లో పోస్టింగ్‌లు కల్పించారు. అయితే ఈ పోస్టింగ్‌ల్లో ఎక్కువ శాతం స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సుల ఆధారంగానే జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. శనివారం రాత్రికే తహసీల్దార్ల పోస్టింగ్‌ల ఆర్డర్ అయినప్పటికీ వాటిని ఆదివారం ఉదయం విడుదల చేశారు. ఐదు మండలాలను ఖాళీగా పెట్టి వాటికి డిప్యూటీ తహసీల్దార్లను ఇన్‌చార్జిలుగా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. పెద్దగా సిఫార్సులు తెచ్చుకోలేని వారికి కలెక్టరేట్, ఆర్‌డీవో కార్యాలయాల్లో పోస్టింగ్‌లు లభించాయని రెవెన్యూవర్గాలు చర్చించుకుంటున్నాయి. తహసీల్దార్ల పోస్టింగ్‌ల కోసం తెరవెనక సిఫార్సులు పెద్దఎత్తున జరిగాయని తెలిసింది. అమరావతి రాజధాని వెలుపల ఉన్న తాడికొండలో పోస్టింగ్ హాట్ కేక్‌లా మారింది. ప్రస్తుతం రాజధానిలో కంటే ఈ మండలంలోనే భూముల క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ దృష్ట్యా ఈ మండలంపై ఏకంగా 11 మంది తహసీల్దార్లు కన్నేసి ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఉన్నతాధికారుల ద్వారా కూడా ప్రయత్నాలు చేశారని తెలిసింది. గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ పోస్టింగ్ విషయంలో ఇద్దరు టీడీపీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయని సమాచారం. తాము సూచించిన తహసీల్దార్‌కే పోస్టింగ్ ఇవ్వాలని వారిద్దరూ పట్టుబట్టారని తెలిసింది. అయితే ఓటర్లు అధికంగా ఉన్న గుంటూరు పశ్చిమ మండల నేత మాటే చివరికి నెగ్గింది. పెదకాకాని మండలానికి రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వచ్చిన ఏపీ సచివాలయం ఉద్యోగి ఇక్కడే కొనసాగేందుకు శతవిధాల ప్రయత్నించారన్న చర్చ జరుగుతున్నది. తహసీల్దార్ల కొరత ఉండటంతో ఐదు మండలాలను ఖాళీగా పెట్టారు. వచ్చే నెలలో జరిగే సాధారణ బదిలీల్లో వాటికి పూర్తిస్థాయి తహసీల్దార్లను నియమించే అవకాశం ఉన్నది.

తహసీల్దార్లకు మండలాలు ఇలా..

జీవీఎస్ ఫణీంద్రబాబు(గుంటూరుపశ్చిమ), డీ పద్మనాభుడు(మేడికొండూరు), ఎస్ శ్రీకాంత్ కేదార్‌నాథ్ (పెదనందిపాడు), జీ నాంచారయ్య (ఫిరంగిపురం), కే రవిబాబు(ప్రత్తిపాడు), కే నాసరయ్య (తాడికొండ), జీ సిద్ధార్థ(కొల్లిపర), కే శ్రీనివాసశర్మ (చేబ్రోలు), బీ వెంకటస్వామి(కాకుమాను), షేక్ మెహబూబ్‌సుభాని (మంగళగిరి), కేవీ గోపాలకృష్ణ (తెనాలి), పీ నగేష్(పెదకాకాని), ఎం నాగిరెడ్డి(వట్టిచెరుకూరు), ఎం పూర్ణచంద్రరావు (కలెక్టరేట్ ఏవో), కే మల్లీశ్వరి(కలెక్టరేట్ మేజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్), కే సాంబశివరావు(కలెక్టరేట్ భూ వ్యవహారాల సెక్షన్ సూపరింటెండెంట్), షేక్ ఇస్మాయిల్(కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్), కే కల్యాణి(గుంటూరు ఆర్‌డీవో కార్యాలయం డీఏవో), జే ప్రసాదరావు(తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏవో)గా పోస్టింగ్‌లు పొందారు. కాగా దుగ్గిరాల డీటీయూ రాజేష్, తాడేపల్లి డీటీ ఎస్ సతీష్, తుళ్లూరు డీటీ వసంతరావు, గుంటూరు తూర్పు డీటీ షేక్ రిజ్వాన్, పొన్నూరు డీటీ ప్రశాంతిని ఆయా మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు పూర్తి అదనపు బాధ్యతలు కల్పించారు. పెదకాకాని తహసీల్దార్ రత్నంని రిలీవింగ్ చేసి తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

శాంతి స్థాపనతోనే సుస్థిరాభివృద్ధి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



కార్యక్రమంలో విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శాంతి స్థాపనతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ రజతోత్సవ చిత్ర ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా వివిధ కళాశాలల విద్యార్థులతో మాట్లాడారు. తొలుత కార్గిల్ యుద్ధంలో అమరవీరులైన జవాన్లకు ఎమ్మెల్సీ నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మొదటి, రెండు ప్రపంచయుద్ధాలు మొదలుకుని ప్రస్తుతం కొనసాగుతోన్న ఇజ్రాయెల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల వరకు మూలకారణానికి పరిష్కారం లేకుండా అపారమైన విధ్వంసం, మానవనష్టం జరుగుతున్నాయన్నారు. దేశాలు యుద్ధాల కంటే చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు సమకాలీన అంశాలపై తమదైన దృక్కోణాలు ఏర్పరుచుకోవడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి తగిన సమయం వెచ్చించాలని లక్ష్మణరావు కోరారు. రాష్ట్రంలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ క్షేత్రస్థాయి ప్రచారం చేసే సీబీసీకి చెందిన వివిధ కార్యకలాపాలను డైరెక్టర్ పి.రత్నాకర్ వివరించారు. దేశ నిర్మాణంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ డాక్టర్ జీడీ హల్లెకెరి మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే సాయుధ సిబ్బందిని గౌరవించడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను సీబీసీ సీనియర్ ఏవో శ్రీదేవినాయర్ అభినందించారు. సీబీసీ క్షేత్ర ప్రచార అధికారి ఆర్ రమేశ్చంద్ర మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధ సమయంలో కార్గిల్, లేహ్ పౌరుల సహకారాన్ని విస్మరించలేమని అన్నారు.

ఇసుక రీచ్‌లో దళారులు కనిపిస్తే కేసులు నమోదు చేయండి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జూలై 28: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఇసుక బుకింగ్ చేసుకుని బిల్లులను లారీ డ్రైవర్‌లకు అధిక ధరలకు అమ్ముకునే దళారులు కనిపిస్తే కేసులు నమోదు చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద జరుగుతున్న దళారుల దందాపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కోసం, పేదల ఇండ్ల నిర్మాణం కోసం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీని కొందరు దళారులు నిర్వీర్యం చేస్తూ ఇసుక అధిక ధరలకు అమ్ముకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతమైతే క్షమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సత్వరం స్పందించి ఇసుక బుకింగ్, లోడింగ్ వద్ద క్యూపద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలని, క్యూలో వచ్చిన వాహనాలకు మాత్రమే ఇసుక బుకింగ్, లోడింగ్ చేయాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్‌ల వద్ద ఏ పార్టీకి చెందిన దళారులైనా క్షమించేదిలేదని ప్రవీణ్ హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం వైకుంఠపురం రీచ్‌లో ఒక ఎస్ఐ, ఇద్దరు సిబ్బందిని ఉంచి ఇసుక బుకింగ్ సక్రమంగా జరిగేలా, వాహనాలు క్యూపద్ధతిలో వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనాలు లేకుండా ఇసుక బుకింగ్ చేసుకుంటే అనుమతించేది లేదని సీఐ బ్రహ్మం తెలిపారు.

కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి రూ. 80వేల కోట్లు

● వివిధ కేంద్ర పథకాల ద్వారా మరింత లబ్ధి ● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి రూ.80వేల కోట్లు వస్తున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా అమరావతికి ఎవరూ ఊహించని రీతిలో రూ.15వేల కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. వచ్చే రెండు మూడేళ్లలో పోలవరాన్ని పూర్తిచేసేందుకు కేంద్రం సంసిద్ధత ప్రకటించిందని చంద్రశేఖర్ అన్నారు. పెరిగిన అంచనాలను సైతం పూరిస్తూ పోలవరం ప్రాజెక్టుకు రూ.30వేల కోట్ల నుంచి రూ.40వేల కోట్లు కేంద్రం కేటాయించే అవకాశం వచ్చిందన్నారు. అమరావతిలో రూ.2,500కోట్లతో రైల్వేలైను మంజూరైందని, ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.12వేల కోట్ల నుంచి రూ.15వేల కోట్ల విలువ అవుతుందని, దానికి భూసమీకరణ బాధ్యత కూడా కేంద్రం తీసుకుని రాష్ట్రానికి వెసులుబాటు కల్పించిందని తెలిపారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను కూడా చేర్చి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నారు. మొత్తంగా చూస్తే ఈ బడ్జెట్ ద్వారా రూ.80వేల కోట్ల నిధులు మన రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. అవేకాకుండా కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, తగినన్ని నిధులు కేటాయిస్తే మరింత ప్రయోజనం పొందవచ్చన్నారు. నరేగా నిధుల కేటాయింపు పెరిగింది. ఉపాధి హామీ పథకం ద్వారా నరేగా నిధులు వాడుకుని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. తద్వారా కూలీలకు ఉపాధి హామీ లభిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి వ్యక్తికి రూ.5లక్షల కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా వస్తుందని, ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు వచ్చేల కృషి చేస్తామన్నారు. గతంలో గుంటూరు జిల్లాలో 3లక్షల మందికి అవకాశం వస్తే, 28వేల మందికి మాత్రమే కార్డులు వచ్చాయన్నారు. అలా జరగకుండా పథకాన్ని సద్వినియోగం చేస్తామన్నారు. జలజీవన్ మిషన్లో 14వేల కోట్లు కేటాయిస్తే మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా జగన్‌రెడ్డి రూ.12వేల కోట్లు వాడకుండా వదిలేశారని పెమ్మసాని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి అందించే ప్రయత్నం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో నిరుద్యోగ సమస్య, రైతాంగ సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టిందన్నారు. పేదలకు ఉచితంగా విద్యుత్ అందించే సోలార్ స్కీంను ముందుకు తెచ్చిందన్నారు. ఇంకా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, మీడియా సెల్ నేత ప్రాతూరి నాగభూషణం మాట్లాడుతూవికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, తాళ్ల వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కేతు

● కేతు స్మృతి సంచిక ఆవిష్కరణలో మధురాంతకం నరేంద్ర



కేతు స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, మధురాంతకం నరేంద్ర, దాదాహయాత్ తదితరులు

కడప (కల్చరల్), జూలై 28 : సంపాదకుడిగా, కథకుడిగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా కేతు విశ్వనాథరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రసిద్ధ కథా నవలా రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడు కేతు విశ్వనాథరెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి నిర్వహణలో ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కేతు స్మృతి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రసిద్ధ రచయిత దాదాహయాత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ కేతు స్మృతి సంచిక కేతు తలపులలో అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన ప్రసంగాన్ని మధురాంతకం నరేంద్ర చేశారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడిగా ఈ ప్రాంతపు ఆర్థిక, సాంఘిక, సంక్లిష్టతలను, సంక్షోభాలను, వాటి మాటున దాగిన మానవీయ కోణాలను ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథకు నిలువెత్తు రూపం కేతు అన్నారు. సాహిత్యమే జీవితంగా కేతు బతికారన్నారు. కేతులో ఇద్దరు మనుషులున్నారని, భిన్నమైనవారు కాదు, పరిపూర్ణమైన వారు కాదు, అయినా భిన్నంగా కనిపిస్తారన్నారు. ఇలాంటి రచయితలు చాలా అరుదుగా ఉంటారన్నారు. ఆయన నమ్మిన విషయాన్ని ఎదుటివారికి నొప్పి లేకుండా చెప్పడంలో చాలా దిట్ట అన్నారు. ప్రధానంగా కేతులో రాయలసీమ తాలూకా బైరాగి లక్షణాలుండేవన్నారు. భౌతికంగా కేతు మన మధ్య లేకపోయినా ఆయన రాసిన కథలు మనలను వెంటాడుతూనే ఉంటాయన్నారు. కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ కేతు రాసిన కథల్లో రాయలసీమ కరువు, స్త్రీ పక్షపాతమూ ఉంటుందని ఆయన కథలను ఉదహరించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తాను కథలు రాసిన తొలినాళ్ళలో తన కథల్లో విధి పాత్రను తగ్గించుకోవాలని మంచి సూచన చేశారన్నారు. కథా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేతు, సింగమనేనిలు తన కథా రచనకు ముందు వెనుక ఉండి నడిపించారని అన్నారు. ఇంకా విశ్రాంత చరిత్ర అధ్యాపకులు వై.ప్రభాకర్‌రెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, సాహితీవేత్తలు సంజీవమ్మ, టక్కోలు మాచిరెడ్డి, సుంకోజి దేవేంద్ర, కేతు విశ్వనాథరెడ్డి కుమార్తె శిరీష, సీనియర్ పాత్రికేయుడు రమణయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, నాయకులు సుబ్రమణ్యం, ఆర్‌సీపీ నాయకులు ఎన్.రవిశంకర్‌రెడ్డితో పాటు పలువురు రచయితలు, పాల్గొన్నారు.

ఘనంగా లావు రత్తయ్య పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జూలై 28: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు మాత్రమే తారతమ్య భేదాలు లేకుండా శుభాకాంక్షలు తెలియజేస్తారని అన్నారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఇంకా ఎక్కువ సంతోషిస్తామని తెలిపారు. విద్యార్థులతో తనకున్న అనుబంధం మాటల్లో వర్ణించలేనిదని, అందుకోసమే ప్రతి సంవత్సరం తన పుట్టినరోజును ఇలా విద్యార్థుల మధ్య జరుపుకోవడానికి ఇష్టపడతానన్నారు. క్రియేటివ్‌గా ఆలోచిస్తేనే విజయం సాధించగలరని విద్యార్థులకు సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలోనే విద్యార్థులు సరైన దిశగా ఎదగగలరనే సిద్ధాంతాన్ని తాను మొదటి నుంచి నమ్ముతున్నానని చెప్పారు. అనంతరం పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్‌పర్సన్ బీ రుద్రమదేవి, వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఫణీంద్రకుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే మోహన్‌రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కేటాయింపులో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలి

● విశ్వబ్రాహ్మణ డిక్లరేషన్‌పై ప్రభుత్వం న్యాయం చేయాలి
● ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు తదితరులు

గుంటూరు, జూలై 28: ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నామినేటెడ్ పదవుల కేటాయింపులో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం అరండల్‌పేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో భాగంగా విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రాష్ట్ర మహిళా కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఈశ్వరి మాత ట్రస్ట్ ఏర్పాటు చేయటానికి కమిటీ తీర్మానం చేసిందని, ప్రధానమంత్రి ఉపాధి కల్పన యోజన పథకం సంబంధించి ప్రతి జిల్లా నుండి కనీసం ఐదు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధ్యక్ష కార్యదర్శుల పర్యవేక్షణలో పనిచేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దువ్వూరి నరసింహాచారి, లీగల్ సెల్ అధ్యక్షుడు పేరుసోముల గురుప్రసాద్, గౌరవ అధ్యక్షుడు జవ్వాజి కూర్మాచారి, కోశాధికారి సింహాద్రి ధనుంజయచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహరాచారి, ఉపాధ్యక్షుడు గడ్డి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నందవీర ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అంగలకుదిటి సుశీల, ప్రధాన కార్యదర్శి లక్కోజు సూజత, మహిళా గౌరవ అధ్యక్షులు వాసవి, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ ముంజంపల్లి నాగరాజకుమారి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అద్దంకి భద్రయ్య, ప్రధానకార్యదర్శి కందేపు వెంకట్రావు, కొంకిపూడి కోటేశ్వరరావు, వివిధ జిల్లాల కమిటీల నాయకులు హాజరయ్యారు.

కౌలు రైతు ఆత్మహత్య



వీరవసంతరావు(ఫైల్)

సత్తెనపల్లి రూరల్, జూలై 28 : అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నందిగామలో శనివారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోలినేని వీరవసంతరావు(38) కొన్ని సంవత్సరాలుగా పది ఎకరాల పొలం కౌలుకు తీసుకొని ఐదు ఎకరాలు పత్తి, ఐదు ఎకరాలు మిర్చి సాగు చేస్తున్నారు. ఏ ఏడాదికి ఆ ఏడాది పంటల సాగులో దిగుబడులు తగ్గటం, పంటలు సరిగా పండకపోవటం జరిగింది. పంటల సాగుకోసం సుమారు రూ.7 లక్షల వరకు అప్పులు తీసుకువచ్చాడు. అవి తీర్చేమార్గం లేకపోవటంతో మనస్థాపం చెంది ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అది గమనించిన కుటుంబ సభ్యులను ఆయనను చికిత్స నిమిత్తం సత్తెనపల్లికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య లక్ష్మీ తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఫిరంగిపురంలో భూమి రికార్డులు పరిశీలించిన సీసీఎల్ఏ



ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయంలోని కార్స్ బేస్‌స్టేషన్‌ని పరిశీలిస్తున్న సీసీఎల్ఏ జయలక్ష్మి

గుంటూరు (ఫిరంగిపురం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం మండల తహసీల్దార్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న రీ-సర్వే పనులకు సంబంధించి రికార్డులను, రిజిస్టర్లతో పాటు వెబ్-ల్యాండ్‌ను రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మీ పరిశీలించారు. ఆదివారం ఆమె సర్వే, సెటిల్మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీరావుతో కలిసి ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయ పైఅంతస్తులో వున్న రీసర్వేకి సంబంధించిన కార్స్ బేస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. దీని నిర్వహణ, పని చేసే విధానం గురించి సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే వెబ్ ల్యాండ్ వివరాలు డిప్యూటీ తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మీని గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్వే సహాయ సంచాలకుడు నాగ సాయి, డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్, మండల సర్వేయర్లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ బ్యాంక్ ఉద్యోగి మృతి



వెంకటేష్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూలై 28: కారు అదుపుతప్పి ఎస్ బ్యాంక్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన ప్రత్తిపాడులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం పెదనందిపాడుకు చెందిన మొద్దు వెంకటేష్(31) గత రెండు సంవత్సరాలుగా చెన్నైలోని ఎస్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. రెండురోజులు సెలవు పెట్టుకుని స్వగ్రామానికి వచ్చిన ఆయన శనివారం సాయంత్రం తన కారులో గుంటూరుకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తరువాత తిరిగి పెదనందిపాడు వెలుతుండగా ప్రత్తిపాడు వద్ద కారు అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్త చౌడయ్యపై దాడి

రెంటచింతల, జూలై 28: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎర్రబాలెంలో టీడీపీ కార్యకర్త బోయిన చౌడయ్యపై ఆదివారం రాత్రి వైసీపీకి చెందిన కోటయ్య, పిచ్చయ్యతో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. చౌడయ్య పశువులకు మేత వేసి వస్తున్న సమయంలో మంచం పట్టెతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. అపస్మారక స్థితిలో వున్న చౌడయ్యకు స్థానికంగా చికిత్స చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు చెప్పారు.

పేద విద్యార్థులకు రూ.15లక్షల విలువైన సైకిళ్ల పంపిణీ

● వి.ఆర్.కె. ట్రస్ట్ ద్వారా రవికిరణ్ ఎనలేని సేవలు ● ఎమ్మెల్యే ఆనందబాబు



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, ప్రముఖ పారిశ్రామిక వేత్త రవికిరణ్

కొల్లూరు, జూలై 28: అడిగినవారికి లేదనకుండా సాయం చేస్తూ నిజమైన శ్రీమంతుడుగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జిస్తున్న వేములపల్లి రవికిరణ్ అభినందనీయులని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని జువ్వలపాలెంలో వి.ఆర్.కె ట్రస్ట్ ద్వారా ప్రముఖ పారిశ్రామిక వేత్త రవికిరణ్ రూ.15లక్షలు వెచ్చించి 275మంది పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే ఆనందబాబు చేతులమీదుగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలోనే ప్రముఖ కాంట్రాక్టర్‌గా ఉన్నప్పటికీ పుట్టిన గ్రామానికి ప్రతి ఆదివారం వస్తూ ఇక్కడ జరుగుతున్న విషయాలను తెలుసుకుని ఇబ్బందులు ఉన్నవారికి ఇతోధికంగా ఆర్థికసాయం అందిస్తున్నారన్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాలతో పాటు ఇతర మండలాల వారు సైతం ఆయన వద్ద ఆర్థికసహాయం కోసం రావడం, వచ్చినవారికి లేదనకుండా సహాయం చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఎదిగితేనే సేవాగుణంతో ఎంతోమంది పేదలకు సహాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. చంద్రబాబు గతంలో వేసిన పునాదుల వల్లే అన్ని దేశాల్లో తెలుగువారు ఐటీ రంగంలో ముందున్నారన్నారు. లోకేశ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి దూసుకు వెళుతుందన్నారు. దాత రవికిరణ్ మాట్లాడుతూ, తాను గ్రామానికి విచ్చేసినప్పుడు నలుగురు పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్ లేక ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. దీంతో సైకిళ్లు లేక పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థినీ విద్యార్థుల గురించి విచారణ చేయించామన్నారు. 275మందికి సైకిళ్లు అవసరమని గుర్తించామని, తరగతులు, వయసుల వారీగా బాలబాలికలకు రూ.15లక్షల వ్యయంతో సైకిళ్లు తయారు చేయించామన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థులకు ఎంత ఖర్చుపెట్టి అయినా విద్య నేర్పించేందుకు తాను ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ పి.మురళీకృష్ణ, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యతలు మాకొద్దు...!

బాపట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో వైసీపీ ఓటమి పాలయ్యాక బాపట్ల జిల్లాలోని పార్టీ నేతలు చాలావరకు క్రియాశీలకంగా లేరు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్ష బాధ్యతల విషయంలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు కొనసాగడానికి సుముఖంగా లేనట్లు సమాచారం. ఇటీవల జగన్ నిర్వహించిన ఎంపీల సమావేశానికి కూడా ఆయన డుమ్మాకొట్టారు. పలుమార్లు పార్టీవర్గాలు ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. రేపల్లె నియోజకవర్గ అసెంబ్లీ సీటు తనని కాదని డాక్టర్ ఈవూరు గణేష్‌కు ఇవ్వడం పట్ల అప్పటి నుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఫలితాలు వచ్చాక పూర్తిగా సైలెంట్ అయ్యారు. జిల్లా అధ్యక్షుడి నియామకంపై జగన్ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఏ ఒక్క నాయకుడు పార్టీ పగ్గాలు చేపట్టడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది.

లాకుల గేటు కింద పడి బాలుడి మృతి



లాకుల గేటు కింద పడి మృతిచెందిన బాలుడు

మంగళగిరి, జూలై 28: ప్రమాదవశాత్తూ కెనాల్ లాకుల గేటు కింద పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన పెదవడ్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన తొడిమెల విజయ శ్రీహర్ష(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గ్రామంలోని నంబూరు కెనాల్ వద్ద ఆదివారం ఉదయం పది గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటు న్నాడు. కెనాల్ నుంచి నీళ్లు రాకపోవడంతో గేటును రెండు అడుగుల మేర ఎత్తి వుంచారు. ఈ నేపథ్యంలో గేటు కింద నుంచి శ్రీహర్ష దాటుకుని వచ్చే ప్రయత్నంలో గేటు జారి పడింది. దీంతో శ్రీహర్ష తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని సందర్శించి కారణాలను తెలుసుకున్నారు. లస్కర్‌ను పిలిపించి గేటు పనితీరును పరిశీలించారు. గేటు దించడానికి, ఎత్తడానికి స్క్రూడ్రైవర్ అవసరమని, ఒక్కో సందర్భంలో గేటును కదలిస్తే అది జారిపోవడానికి అవకాశం వుందని లస్కర్ తెలియజేశారు. బాలుడి మృతిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమల అటవీ ప్రాంతంలో వజ్రాల వేట

కారంపూడి, జూలై 28: మండలంలోని సింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పైభాగాన ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలోని కొండల్లో గత రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో వజ్రాలు దొరుకుతాయని ఆశతో ఆశాజీవులు వెతుకులాట ప్రారంభించారు. కొందరు మట్టి కొండల్లో తవ్వి గుంతల్లో అడుగు భాగాన ఉన్న ప్రతి రాయిని తీసి శుభ్రం చేసి పరిశీలిస్తున్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో వజ్రాలు దొరికాయనే ఆశతో ఈ కొండల్లో సైతం ఉన్నాయని వెతుకులాట ప్రారంభించారు. అయితే శని, ఆదివారాల్లో ఎవరికీ వజ్రాలు దొరికిన దాఖలాలు లేవు. ఆశాజీవులు మాత్రం వదిలిపెట్టకుండా వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు.



వజ్రాల కోసం వెతుకుతున్న ఆశాజీవులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

నేడు అండర్-7 విభాగంలో రాష్ట్రస్థాయి చెస్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 28: నైట్స్ క్యాస్టల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక అంజనేయపేట, విజేత ఐఐటీ ఫౌండేషన్‌లో అం డర్ -7 బాల, బాలికల విభాగంలో 29వ తేదీన సోమవారం రాష్ట్ర స్థాయి చెస్ ఎంపికలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 తరువాత పుట్టినవారు ఈ పోటీలకు అర్హులని అన్నారు. ఆసక్తి కల్గిన వారు ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరవ్వాలని కోరారు. పోటీల్లో తొలి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8919983849, 79816 64035 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉత్సహంగా జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వనమా నరేంద్ర, పాల్గొన్న కోచ్‌లు

గుంటూరు(తూర్పు), జూలై 28: స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్-2024 పోటీలు ఉత్సహంగా సాగింది. ముఖ్యఅతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్ర, పెదనందిపాడు తహసీల్దార్ కేదార్‌నాథ్ హాజరై పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్స్ క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలికలకు విడి, విడిగా పోటీలను ప్రారంభించారు. పోటీలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.కాశీనాథరెడ్డి మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన క్రీడాకారులు ఆగస్టు 2వతేదీన అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదగా సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ రమణ, వలీ, సాయి, విజయ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడిగా విజ్ఞాన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 28: ఆనాటి జ్ఞాపకాలు నుంచి నేటి కుటుంబ పరిస్థితుల వరకు పలకరింపులు.. పులకరింతలతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సందడికి వేదికయ్యింది. 1997 నుంచి 2023 విద్యా సంవత్సరానికి చెందిన 26 బ్యాచెస్ విద్యార్థులందరూ తమ కుటుంబసభ్యులతో శనివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీలో కలిశారు. ఎవరెక్కడ స్థిరపడ్డారో తెలియజేయడంతో పాటు మిత్రులందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వీయ చిత్రాలు, బృంద చిత్రాలు దిగారు. యూనివర్సిటీలో చదివిన రోజులను గుర్తు చేసుకుని ప్రతి ఒక్కరూ కొత్త అనుభూతికి లోనయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థికి కృతజ్ఞతలు తెలియజేశారు. జీవితంలో మీరందరూ వృత్తిపరంగా ఉన్నత స్థానాల్లో స్థిరపడినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మీరందరూ మీ మీ రంగాల్లో ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ నాగభూషణం, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బీ రుద్రమదేవి, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ సీఈగా శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

● శ్రద్ధాంజలి ఘటించిన అధికారులు, ఉద్యోగులు



శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ జేడీ రాజశేఖర్

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో వివిధ హోదాలలో 39 ఏళ్ల పాటు దీర్ఘ కాలం పాటు చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ శాఖ మార్కెటింగ్ విజిలెన్స్ జేడీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని రింగురోడ్డులో దివంగత సీఈ శ్రీనివాస్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖకు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుంటూరు మిర్చి యార్డుతో పాటు రాష్ట్రంలోని వివిధ మార్కెట్ కమిటీల్లో శ్రీనివాస్ మార్కు అభివృద్ధి చిరకాలం నిలిచిపో తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ రాష్ట్ర ఉద్యోగుల సంఘం నేత ఏ భాస్కరరెడ్డి, మిర్చియార్డు సెక్రెటరీ ఐ వెంకటేశ్వర రెడ్డి, ఎస్‌టీ విభాగం నేత అమాష్ రాములు, డీఈ ఎం శ్రీనివాస్, మద్దినేని శ్రీనివాస్ కుటుంబసభ్యులు, వివిధ కమిటీల సెక్రటరీలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షిక వేడుకలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కోటా మాల్యాద్రి, పక్కన రావుల అంజిబాబు తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 28: దేశంలో బడుగు, బలహీన, కార్మిక వర్గాల, పేదల సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సీపీఐ శత వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం, నందివెలుగు రోడ్డులోని సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద సీపీఐ సివిల్ సప్లయిస్ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరు 26న సీపీఐ 100 సంవత్సరాల్లోకి అడుగుపెడుతుందని, ఈ వ్యవస్థాపన దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నూతలపాటి చిన్నా, అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, వినుకొండ డేవిడ్, కాంతారావు, జాన్‌బాబు, సురేషు, చిలక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే మాధవి పూజలు



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి దుగ్గిరాల మండలంలో ప్రసిద్ధి చెందిన కేఆర్‌కొండూరు మహంకాళీ అమ్మవారిని ఆషాఢమాసం ఆఖరి ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాధవికి దేవస్థానం తరపున అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి గోత్రనామాలతో పూజ జరిపి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, ఈవో వెంకట రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, పలువురు నాయకులు పాల్గొన్నారు. - దుగ్గిరాల.

టూ టౌన్ అష్టదిగ్బంధనం

● రెండున్నర గంటల పాటు నాకాబంది
● పది ముఖ్య ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు
● స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ సతీష్‌కుమార్



నాకా బందీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 28 : పోలీసులు టూ టౌన్ ను అష్టదిగ్బంధనం చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు నగరంలోని వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో నాకాబంది నిర్వహించారు. టూ టౌన్‌లోకి రాకపోకలు సాగించే అన్ని మార్గాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పట్టాభిపురం, అరండల్‌పేట, నగరంపాలెం, నల్లపాడు పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని గుజ్జనగుండ్ల, బృందావన్ గార్డెన్స్, పట్టాభిపురం స్వామి థియేటర్, చుట్టుగుంట, శ్రీనివాసరావుతోట 60 అడుగుల రోడ్డు, డొంక రోడ్డు, లక్ష్మీపురం మదర్ థెరిసా బొమ్మ సెంటర్, అమరావతి రోడ్ లోని శ్రీనగర్ జంక్షన్, జేకేసీ రోడ్డులోని ఓరియన్ హోటల్ సెంటర్, ఇన్నర్ రింగ్‌రోడ్ లోని చిల్లీస్ దాబా సెంటర్లలో ఆయా వాహన తనిఖీలు జరిగాయి. తనిఖీలను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. ఒక్కో సెంటర్లో కనీసం 15 నుంచి 20 మందికి తక్కువ కాకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొద్ది సంవత్సరాలుగా నగరంలో యువకులు ర్యాష్ డ్రైవింగ్, రేసులు, త్రిబుల్ రైడింగ్, డ్రంకన్ డ్రైవ్, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లు పెద్ద సంఖ్యలో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సతీష్ కుమార్ అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆదివారం నాకా బందీ పేరుతో ఈ తనిఖీలకు ఆదేశాలిచ్చారు. మాదక ద్రవ్యాలు, గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు నాకా బందీకి శ్రీకారం చుట్టారు. ఎస్పీ సతీష్‌కుమార్ నాకాబంది కార్యక్రమం నిర్వహించే ప్రతి పాయింట్ వద్ద స్వయంగా పర్యటించి వాహనాలను తనిఖీలు నిర్వహించే అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. యువత ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపే వారు, డ్రంకన్ డ్రైవ్ వాహనాలను, ట్రిపుల్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మైనర్లు వాహనాలను నడిపితే తలిదండ్రులదే బాధ్యత అని ఎస్పీ హెచ్చరించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అక్రమ మద్యం, క్రయ విక్రయాలకు పాల్పడినా, జిల్లాను మాదకద్రవ్యాల రహిత గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, వెస్ట్ డీఎస్పీ మహేష్, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎఆర్ డీఎస్పీ శాంత కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ఆనంద్, వెంకట ప్రసాద్, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

286 వాహనాలు సీజ్ .... 98 వాహనాల నుంచి రూ.5,26,900 జరిమానా

ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నగర పరిధిలోని పలు ప్రాంతాలలో జరిగిన 'నాకా బంది' కార్యక్రమంలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడపడం, బైక్ రేసింగ్, సరైన పత్రాలు లేని వాహనాలను, ఈవ్‌టీజింగ్, త్రిబుల్ డ్రైవింగ్, పబ్లిక్‌కి ఇబ్బంది కలిగించే వాహనాలను సీజ్ చేసారు. ఈ మేరకు మొత్తం 286 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. 98 వాహనాలకు రూ.5 లక్షల 26 వేల 900 చలనా వేసినట్లు ఆయన వెల్లడించారు. మద్యం సేవించి నడుపుతున్న 12 వాహనాలను సీజ్ చేసామన్నారు. ఇక నుంచి నగరంలో ఈ తరహా ఆకస్మిక తనిఖీలు నిత్యం జరుగుతుంటాయని తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి
● నగరంలో పలు సీసీ రోడ్లు, సైడ్ కాలువలకు శంకుస్థాపన



కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదని గుంటూరు పశ్చిమ నియో జకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 44వ డివిజన్ ఆంజనేయపేట, సాకేతపు రంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భముగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారించాలని అధికారులకు ఆమె సూచించా రు. పారిశుధ్యం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తీసిన వ్యర్థాలను అదేరోజు తొలగిం చాలని సూచించారు. ప్రజలకు తాను ఎప్పుడు అందుబాటులోనే ఉంటా నని, ప్రజాసమస్యలను ఎప్పుడయినా నేరుగా తన దృషికి తీసుకు రావాలని స్థానిక ప్రజలను కోరారు. కార్యక్రమంలో యర్రాకుల శ్రీనివాసరావు, కొల్లి అనీల్, కన్నసాని విజయ్‌కు మార్, కన్నసాని బాజీ, మద్దిరాల మ్యాని, ఈరంటి వరప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, ఎలుకా వీరాంజనేయులు, పవన్ వెంకీ, ఆవుల చిన్నా పాల్గొన్నారు.

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ పరిశీలన

కొరిటెపాడులో ఉన్న వాకింగ్ ట్రాక్‌ను గల్లా మాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడి, పార్కులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతానని, వాకింగ్ ట్రాకు ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని గళ్ళా మాధవి హామీనిచ్చారు.

చేతన ఫౌండేషన్, రోటరీక్లబ్‌సేవలు అభినందనీయం

చేతన ఫౌండేషన్, రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. చేతన ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఖమ్మం సెనెటోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కృత్రిమ పాదా ల స్క్రీనింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పానకాల బాలసుబ్రమణ్యం, సీతారాం, సామినేని కోటేశ్వరరావు, కార్పొరేటర్ మానం పద్మశ్రీ, మలినేని పెరుమాళ్లు, తొట్టెంపూడి కల్యాణ్ చక్రవర్తి, కందిమల్ల స్వప్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంను అగ్రస్థానంలో నిలబెట్టడానికి కృషి

● టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు
● వైవీ రావు మిత్రమండలి ఆధ్వర్యంలో ఘన సత్కారం



వసంత కృష్ణప్రసాదు దంపతులను సత్కరిస్తున్న వైవీ రావు మిత్ర మండలి సభ్యులు

గుంటూరు(తూర్పు), జూలై 28: మైలవరం నియోజకవర్గాన్ని అగ్ర భాగాన నిలబెట్టడానికి కృషి చేస్తానని ఆ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అన్నారు. ఆదివారం, గుంటూరు, గుజ్జనగుండ్ల వీ కన్వెన్షన్‌లో వైవీ రావు మిత్రమండలి ఆధ్వర్యంలో వసంత కృష్ణప్రసాదు దంపతులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. సభకు టీడీపీ నాయకులు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాదు మాట్లాడుతూ పార్టీ మారినప్పటికి కూడా మైలవరం ప్రజలు ఆదరించారని, ఎప్పుడు లేనివిధం గా 40వేలకు పైగా మెజార్టీ అందించారని అన్నారు. చంద్రబాబునాయు డు, లోకేశ్ నన్ను నమ్మి సీటు ఇచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా నని అన్నారు. వైసీపీలో పనిచేసే సమయంలో కూడా టీడీపీ కార్యకర్త లపై దాడులను ప్రోత్సహించలేదని, అదే సంస్కృతిని కొనసాగిస్తానని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వ లక్షణాలు జగన్‌లో ఉన్నాయ ని నమ్మి 2019లో వైసీపీలో చేరానని, అటు వంటి పరిస్థితులు అక్కడ లేవన్నారు. ప్రతిపక్ష నాయకులను అదే సామాజిక వర్గానికి చెందిన నాయకులతో తిట్టించడం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శిం చారు. మూడు రాజధానులు, ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరు మార్పుపై జగన్‌ను విభేదించానని గుర్తుచేశారు. మైలవరంతో పాటు గుంటూరు ప్రజలకు కూడా అందుబాటులో ఉంటానని అన్నారు. మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబునాయుడు లాంటి సమర్థ నాయకత్వం అవసరమని అన్నా రు. అనంతరం వసంతకృష్ణ ప్రసాదు, శిరీష దంపతులను పలు సంఘాలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటిరావు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు లంకా రఘురామిరెడ్డి, దండా బ్రహ్మానంద రావు, కారుమంచి ప్రసాదు, కాకతీయ కన్వెన్షన్ కార్యదర్శి రమేష్ చంద్ర, వైవీ రావు మిత్రమండలి సభ్యులు సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, మై నేని సీతారామయ్య, భాష్యం సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ

గుంటూరు(తూర్పు), జూలై 28: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా కార్య దర్శి వల్లూరి కృష్ణకిషోర్ నిర్వహణలో ఆదివారం త్యాగరాజ కళావేదిక గా సుప్రసిద్ధ గాయకులు జీ అభిరామ బోడె శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. తన సుమధుర గానంతో త్యాగరాజస్వామితో పాటు అనేక వాగ్గేయకారుల కీర్తనలను గానం చేసి సంగీతాభిమానులను అలరించారు. వీరికి వయోలిన్‌పై గాయత్రీ విభావరి మృదంగంపై పీఎస్ ఫల్గున్ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ ఉపాధ్యక్షుడు గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాద్ కళాకారులను సత్కరించారు.



కీర్తనలను ఆలపిస్తున్న అభిరామ బోడె

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



దాత ఆలపాటి వెంకటరత్నంకు బాండు అందజేస్తున్న ఈవో త్రినాథరావు

ద్వారకా తిరుమల, జూలై 28: చిన వెంకన్న నిత్యాన్న దాన ట్రస్టు కు ఓ దాత రూ.5 లక్షల ను విరాళంగా శనివారం అందజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఆలపాటి వెంకటరత్నం, శివ నాగేంద్ర ప్రతీ రోజూ తమపేరున అన్నప్రసాద వితరణ జరపాలని రూ.5లక్షలను డీడీ రూపేణా ఈవో త్రినాథరావుకు అందించారు. స్వామి వారి దర్శన అనంతరం బాండు పత్రాన్ని ఈవో అందజేశారు.

పథకాల పేర్ల మార్పు హర్షణీయం

● మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్

గుంటూరు, జూలై 28: రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఆ శాఖలో నారా లోకేశ్ నేతృత్వంలో డొక్కా సీతమ్మ, మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం వంటి మహనీయుల పేర్లతో పథకాల పేర్లు మార్చి నూతన ఒరవడి సృష్టించారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ప్రతి విద్యా పథకంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేరు ఉండేదని, జగన్ పేరు పెట్టడానికి ఆయన ఏ విలువలకు ప్రతినిధి అని ఆయన ప్రశ్నించారు. జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా భూ కబ్జాలు జరిగాయని దీనిపై రివర్స్ భూకబ్జా మేళా నిర్వహిస్తే బాగుంటుందని వ్యంగ్యంగా వ్యాఖ్యా నించారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపితే బాధితులకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని విలేకరుల సమావేశం నిర్వహించటం బాధ్యతా రహితమేనని విమర్శించారు.

శుద్ధి చేసిన మంచినీరు ప్రజల హక్కు

● రేట్ పేయర్స్ అసోసియేషన్

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): శుద్ధి చేసిన మంచినీరు పొందడం ప్రజ లందరి హక్కు అని, నగర ప్రజలకు శుద్ధ జలాలను సరఫరా చేయాలని రేట్ పేయర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యంపై సభ్యులు చర్చించారు. ఆ రెండు అంశాలపై ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విన్నవించామని, కొత్తగా నియమితులైన నగర కమిషనర్ దినేశ్‌కుమార్ దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లాలని సమావేశంలో తీర్మానించామని తెలిపారు. కార్యవర్గ సభ్యులు వి. సదాశివ రావు, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, రామ్‌కుమార్, అరవింద్,పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జూలై 28: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 190 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 338, నిజాంపట్నం కాల్వకు 277, కొమ్మమూరుకాల్వకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విజయసాయిరెడ్డికి ర్యాబిస్ సోకినట్లుంది

● కనపర్తి శ్రీనివాసరావు



గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డికి ర్యాబిస్ వ్యాధి ముదిరి చివరిదశకు చేరుకున్నట్లుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుని మరోసారి వ్యక్తిగతంగా విమర్శిస్తే ఆయన రోడ్డుమీద తిరిగే పరిస్థితులు ఉండవని హెచ్చరించారు. ఆయన్ను ప్రభుత్వం వెంటనే బంధించి చికిత్స ఇప్పించకపోతే పరిస్థితులు విషమించే ప్రమాదముందన్నారు. రాజకీయాల్లో నీతి, జాతి లేని ఏకైక వ్యక్తి సాయిరెడ్డని మండిపడ్డాడు. ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసినా వారి మాటల్లో మార్పు రాకపోవటం సిగ్గుచేటన్నారు. విశాఖను కేంద్రంగా చేసుకొని సాయిరెడ్డి చేసిన అవినీతి, అరాచకాలు, భూ ఆక్రమణలపై ప్రత్యేక విచారణ జరిపితే ఆయన శాశ్వతంగా జైలుకెళ్ళక తప్పదన్నారు. అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్‌ల వరకు సొంత సామాజికవర్గం వారిని నియమించుకొని అవినీతి, అరాచకాలకు పాల్పడటంవల్లే ప్రజలు బుద్ధి చెప్పారని, అయినా వైసీపీ నేతలకు సిగ్గురాలేదని అన్నారు. కీలకమైన 15 కార్పోరేషన్లకు సొంత సామాజిక వర్గం వారిని నియమించుకున్న సాయిరెడ్డికి సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో 26 మంది కమ్మ సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించారని తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక కేవలం నలుగురే అని చెప్పిన విషయం ప్రజలు గమనించారని గుర్తుచేశారు. వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

డాక్టర్ సుమితా శంకర్‌కు బ్లాక్ బక్ అవార్డు



అవార్డుతో డాక్టర్ సుమితా

గుంటూరు (మెడికల్), జూలై 28: గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్వత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్‌కు న్యూఢిల్లీ లో ప్రతిష్టాత్మక పయినీర్ రీసెర్చ్ బ్లాక్ బక్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణాశాఖ సహాయ మంత్రి శ్రీహర్ష మల్హోత్ర, జల్‌శక్తి మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ అవార్డును ఆమెకు అందజేశారు. బోదకాలు రోగులకు లింఫెడి మాను తొలగించే సర్జరీలు చేసేందుకు వినూ త్న పద్ధతుల్లో డాక్టర్ సుమితా చేసిన పరిశోధనలను గుర్తించి ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. బ్లాక్ బక్ అవార్డు సాధించిన ప్లాస్టిక్ సర్జన్ సుమితా శంకర్‌ను నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.

వైద్యశిబిరంతో మెరుగైన వైద్యం : గల్లా రామచంద్రరావు



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మెగా వైద్యశిబిరంతో మెరుగైన వైద్యాన్ని ప్రజలందరికీ చేరువ చేయాలన్నదే తమ లక్ష్యమని వికాస్ వైద్యసంస్థల సీఎండీ గల్లా రామచంద్ర రావు తెలిపారు. ఎల్‌వీఆర్ క్లబ్ రీడింగ్ రూములో ఆదివారం వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈసీజీ, 2డీ ఎకో, బీఎండీ, పీఎఫ్‌టీ, హెచ్‌బీఏ1సీ, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు కనుమూరి సుధాకర్, నాగులపాటి సురేంద్ర, జొన్నలగడ్డ నిహారిక తదిత రులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ 282 మంది సభ్యులు శిబిరంలో వైద్యసేవలు పొందారని తెలిపారు. డిపార్ట్‌మెంట్ వైద్యసేవలతో పాటు, ప్రత్యేక పరీక్షలు నిర్వహించినందుకు క్లబ్ కార్యదర్శి యాగంటి దుర్గారావు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మే శ్వరరావు, వణుకూరి శ్రీనివాసరెడ్డి, యేల్చూరి వెంకటేశ్వర్లు, కొండ్రుగుంట శ్రీనివాస రావు, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ అమ్మవారికి సారె

గుంటూరు(తూర్పు), జూలై 28: స్థానిక ఏటుకూరు రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవి జాగృతి ఇంటర్నేషనల్, వాసవి జాగృతి క్లబ్ గర్తపురి ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారికి సారే మనసారా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరి హాస్పిటల్స్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మానస వాసవీ జాగృతి ఇంటర్నే షనల్ మాస్టర్ కార్డ్ ఇన్‌చార్జీ రంగా రత్నశ్రీ, వనిత జాగృతి క్లబ్ గర్తపురి సభ్యులు రంగా చంద్రశేఖర్, మద్ది రాకేష్, వాసవి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారే సమర్పిస్తున్న భక్తులు

సబ్జెక్ట్ టీచర్స్ పోస్టులను భర్తీ చేయాలి : ఎపీటీఎఫ్

గుంటూరు(విద్య), జూలై 28: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పాఠ శాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ ఉపాధ్యాయ ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 117 వల్ల పాఠశాల విద్యారంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ప్లస్ 2 పాఠశాలలో రెగ్యులర్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టులు మంజూరు చేయలేదని అన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసి సబ్జెక్టు టీచర్స్ కొరత తీర్చాలని కోరారు.

ప్రకృతి వనరుల్ని పరిరక్షించుకుంటేనే మెరుగైన జీవనం

● నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి

గుంటూరు (విద్య), జూలై 28: ప్రకృతి వనరుల్ని పరిర క్షించుకునేందు కు ప్రతి ఒక్క రూ ముందుకు రావాలని నేష నల్ గ్రీన్‌కోర్ కో ఆర్డినేటర్ డి. తిరుపతిరెడ్డి సూచించారు. యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జేకేసీ కళాశాలలో ఆదివారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సర్వ జనులు జీవించడానికి అనువైన వాతావరణాన్ని పెంపొం దించుకోవాలని, అందుకోసం మొక్కల్ని నాటి పరిరక్షించుకోవాలన్నారు. యువత బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ నాగేశ్వరరావు, డాక్టర్ టీఎన్ వరప్రసాద్, జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.రాహుల్, కె.చరణ్‌చౌదరి,యల్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

దిక్సూచి

గుంటూరు ● సోమవారం 29 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 సెక్షన్లు ఉండగా, ప్రస్తుతం బీఎస్ఏలో 170 సెక్షన్లు ఉన్నాయి. గత చట్టంలోని 23 సెక్షన్లలో మార్పులు చేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 3

భారతీయ సాక్ష్య అధినియమ్



కీలకాంశాలు

- ఈ చట్టం 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తరించింది. ఎలక్ట్రానిక్/ డిజిటల్ రికార్డులను కూడా ఈ చట్టం 'పేపర్ డాక్యుమెంట్స్‌'తో సరిసమాన సాక్ష్యాలుగా పరిగణిస్తోంది. ఈ-మెయిల్స్, సర్వర్ లాగ్స్, కంప్యూటర్స్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఎస్సెమ్మెస్‌లు, వెబ్‌సైట్‌లు, లోకేషనల్ ఎవిడెన్స్ వంటి డిజిటల్/ ఎలక్ట్రానిక్స్ సాక్ష్యాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
- అంతేకాక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సాక్ష్యులు, బాధితులు, ముద్దాయిలు తమ వాంగ్మూలం ఇవ్వడానికి ఈ కొత్త చట్టం అనుమతిస్తూ, దానికి వ్యక్తిగత ప్రత్యక్ష వాంగ్మూలంతో సరిసమాన స్థాయి కల్పించింది.
- ముద్దాయి నేరం అంగీకారాన్ని, ఇకపై క్రిమినల్ కేసుల్లో తప్పనిసరిగా పరిగణించక్కర్లేదు. బెదిరింపులు, ప్రలోభాలు తదితరాల కారణంగా నేరాంగీకారం జరిగినట్లు న్యాయమూర్తి భావిస్తే దానిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు.
- సోదాలు, నేర సంఘటన స్థల పరిశీలన సమయంలో తప్పనిసరిగా సంబంధిత అధికారి ఫోన్ ద్వారా చిత్రీకరణ జరపాల్సి ఉంటుంది. అలాంటి దృశ్య, శ్రవణ చిత్రీకరణలు జతచేయని చార్జిషీట్లు చెల్లవు. ఈవిధంగా చిత్రీకరించిన దృశ్య, శ్రవణ చిత్రీకరణలు నేరుగా క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫాంలోకి అప్‌లోడ్ చేయవచ్చు. టాంపరింగ్, అవకతవకలు నివారించడానికి ఎటువంటి జాప్యం లేకుండా వీటిని కోర్టుకు సమర్పించాల్సి ఉంది.
- కోర్టుల్లో పరీక్షించలేని భారీ పరిణామం గల డాక్యుమెంట్స్ లేదా సాంకేతికపరమైన డాక్యుమెంట్ల పరిశీలనలో నిష్ణాతులైన వారు ఇచ్చే వాంగ్మూలాన్ని సెకండరీ ఎవిడెన్స్(ద్వితీయస్థాయి సాక్ష్యం)గా పరిగణిస్తారు.
- ఒక నేరంలో భాగమైన వ్యక్తులను సామూహికంగా విచారిస్తున్నప్పుడు (జాయింట్ ట్రెయిల్) వారిలో ఎవరైనా అరెస్ట్ వారెంట్ అందుకోకపోయినా, పరారీలో ఉన్నా సరే వారిని కూడా కలిపే న్యాయవిచారణ చేస్తారు.

విమర్శలు

- సాక్ష్యాధారాలు చిత్రీకరించే సమయంలో, తదుపరి కూడా నేటి ఆధునిక సాంకేతికతల సహాయంతో, సాంకేతికపరమైన లోపాల సహకారంతో ఏమార్చే అవకాశం ఉంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులు ధృవీకరణ పొంది ధృవపత్రాలను కలిగి ఉన్నప్పుడే వాటిని డాక్యుమెంట్స్‌గా పరిగణిస్తారు. కానీ బీఎస్ఏలో సాధారణ డిజిటల్, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని కూడా సాక్ష్యంగా డాక్యుమెంట్ల స్థాయి కల్పించి పరిగణించడం వైరుధ్యాలకు కారణం అవవచ్చు.
- పోలీసు కస్టడీలోని వ్యక్తి శరీరంపై ఉన్న గాయాలకు పోలీసులు బాధ్యత వహించాలి అనే అత్యున్నత న్యాయస్థానం, లా కమిషన్ సిఫార్సులకు మన్నన దక్కలేదు. అట్టి కట్టుబాటు పోలీసులపై ఏర్పడలేదు.
- కేవలం ఏవో కొన్ని అంశాలు మినహా పాత చట్టమే కొత్తరూపుతో కొనసాగింపునకు వచ్చింది. సాంకేతిక అంశాల జోడింపు తప్ప ఇతరత్రా పెద్దగా విప్లవాత్మక మార్పులు ఏమీ లేవు.
- కొన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేశారు. కానీ నేర స్థలానికి మొదట వెళ్లేది పోలీసులు. వారి సోదాలు, పరిశీలనల చిత్రీకరణల వల్ల ఫోరెన్సిక్ ఆధారాలు భంగపడవచ్చు.

అయితే సాంకేతిక అంశాల జోడింపుతో ఈ కొత్తచట్టం విచారణలో వేగాన్ని తీసుకురావడానికి తోడ్పడటంతోపాటు మారుతున్న నేరాల సరళి నేపథ్యంలో సాక్ష్యాల పరిధిని విస్తరించిందనడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా నేరవిచారణలో, దర్యాప్తులో అక్రమాలను నిరోధించేందుకు సాంకేతికపరంగా చేసిన మార్పులు పారదర్శకతను పెంపొందించగలవు. అయితే గత చట్టంలోని అన్ని అంశాలను పూర్తిగా సంస్కరించలేదు. కేవలం కొద్దిపాటి అంశాల్లోనే మార్పులు చేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలకు నోచుకోని పరిస్థితుల్లో దీనిని ఒక ముందడుగు గానే పరిగణించాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఘనము

రీజనింగ్

I) 8 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల ఎరుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 2 సెం॥ మీ॥ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వల్ల మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 20 బి) 40 సి) 56 డి) 64
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 6 సి) 12 డి) 16
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 24 సి) 32 డి) 48
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 12 బి) 18 సి) 10 డి) 24
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 18 బి) 12 సి) 8 డి) 6

సమాధానాలు:
1. (డి) 2. (ఎ) 3. (బి) 4. (డి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{8}{2} = 4$

మొత్తం ఘనాలు = $(n^3) = 4^3 = 64$.

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికీ మారదు).
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n - 2) \times 12 = (4 - 2) \times 12 = 2 \times 12 = 24$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (4-2)^2 \times 6$
$= (2)^2 \times 6 = 4 \times 6 = 24$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు
$(n-2)^3 = (4-2)^3 = 2^3 = 8$

సులభపద్ధతి: 8 సెం.మీ. కొలత ఉన్న ఘనం 2 సెం॥ మీ॥ కొలతతో విభజిస్తే అంటే నాలుగు నాలుగుగా ఏర్పడుతుంది. ఇప్పుడు నాలుగు నాలుగుగా ఉండే రేఖాచిత్రం ఔట్‌సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	3
2	1	1	2
2	1	1	2
3	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $4^3 = 64$
2. మూడు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే కార్నర్ 4ని 2తో గుణించాలి. (2 అంటే పై వైపు 4 కార్నర్స్ కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న, ఘనాలు అంటే కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అంటే పై వైపు, కింద వైపు, మధ్య వైపు) పై రేఖాచిత్రం గమనించిన కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలినవి 8. దీనిని 3తో గుణించగా $8 \times 3 = 24$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలోని భాగంలో గల వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అంటే ఆరు ముఖాలు అని అర్థం) పై రేఖాచిత్రం గమనించిన చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 4 ఉన్నాయి. కావున $4 \times 6 = 24$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$64-(24+24+8) = 64 - 56 = 8$ సమాధానం అవుతుంది.

II) 15 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల పసుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 3 సెం.మీ.ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 100 బి) 150 సి) 125 డి) 175
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 8 సి) 24 డి) 12
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 36 బి) 12 సి) 48 డి) 24
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 48 బి) 54 సి) 63 డి) 52
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 12 బి) 18 సి) 27 డి) 36

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (ఎ) 4. (బి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{15}{3} = 5.$

మొత్తం ఘనాలు $n^3 = 5^3 = 125$

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికీ మారదు)
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2) \times 12 = (5-2) \times 12 = 3 \times 12 = 36$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (5-2)^2 \times 6$
$= 3^2 \times 6 = 9 \times 6 = 54$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు $= (n-2)^3$
$= (5-2)^3$
$= 3^3 = 27.$

సులభ పద్ధతి: 15 సెం.మీ. కొలత ఉన్న ఘనం 3 సెం.మీ.ల కొలతతో విభజించడం అంటే 15÷3=5 అయిదు అయిదుగా ఏర్పడుతుంది. ఇప్పుడు అయిదు అయిదుగా ఉండే రేఖాచిత్రం వన్ సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	2	3
2	1	1	1	2
2	1	1	1	2
2	1	1	1	2
3	2	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $5^3 = 125$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ 4ని 2తో గుణించాలి. (2 అనగా పై వైపు 4 కార్నర్స్, కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అనగా పై వైపు, కింది వైపు, మధ్యవైపు) పై రేఖాచిత్రం గమనిస్తే కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలింది 12. దీనిని 3తో గుణిస్తే $12 \times 3 = 36$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలో ఉండే వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అనగా ఆరు ముఖాలు అని అర్థం)పై రేఖాచిత్రం గమనిస్తే చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 9 ఉన్నాయి. కాబట్టి $9 \times 6 = 54$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$125 - (54+36+8)$
$125 - 98 = 27$ సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



ప్రస్తుతం మెగా ఫ్యామిలీతో కలసి రామ్‌చరణ్ పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడా సంబరాలను ఆస్వాదిసున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మహిళల సింగిల్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. వీరిద్దరూ పారిస్ వీధుల్లో అనుకోకుండా ఒకరికొకరు ఎదురు పడ్డారు. చిరునవ్వుతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రామ్‌చరణ్ 'పెంపుడు కుక్క పిల్ల రైమ్' తలనిమిరారు సింధు. వారిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇద్దరూ గేమ్ ఛేంజర్‌లే మీ కలయిక అద్భుతం అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో...



వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్న కథానాయకుడు అల్లరి నరేశ్. ఆయన హీరోగా 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఓ నూతన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ఆరంభించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామకృష్ణ అర్రం, కెమెరా: జిజు సన్నీ, సంగీతం: జిబ్రాన్.



కొత్త తరహా పాత్ర

తమిళ హీరో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఇదివరకు ఎన్నడూ చేయని పాత్రను ధనుష్ ఇందులో పోషిస్తున్నారు. ఆయన పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని మేకర్స్ చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సోషల్ డ్రామాలో రష్మిక కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహనరావు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ కొత్త అధ్యక్షుడిగా భరత్ భూషణ్



తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రస్తుత అధ్యక్షుడు దిల్ రాజు పదవీకాలం ముగియడంతో ఆదివారం ఎన్నికలు జరిపి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.. ఈసారి డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి పి.భరత్ భూషణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్ గెలిచారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. అందరం కలసి మంచి నిర్ణయాలతో ముందుకు వెళతాం. ఈ రోజు గెలిచిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాటకు కట్టుబడి ఉండే వ్యక్తులు. గెలిచిన వారికి సభ్యులందరి మద్దతు ఉంటుంది' అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఛాంబర్ అంతా ఒక కుటుంబం. పరిశ్రమలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అందరం కలసి చర్చిస్తాం. భారతదేశంలోని అన్ని పరిశ్రమలను ఒక తాటి మీదకు తీసుకు వచ్చి ముందుకు వెళతాం' అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.

'మిరపకాయ్' కంటే మెరుగ్గా




రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తయారవుతున్న 'మిస్టర్ బచ్చన్' రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో నిర్మాతలు ప్రమోషన్స్‌లో దూకుడు పెంచారు. ఇందులో భాగంగా ఆదివారం టీజర్ విడుదల చేశారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెర కెక్కిన ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిపై రైడ్ చేసే ఇన్‌కమ్ టాక్స్ అధికారిగా రవితేజ నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ '1980-90ల మధ్య జరిగే కథ ఇది. ల్యాండ్ ఫోన్లు, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు.. ఇవన్నీ 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ హాఫ్‌లో నోస్టాలజిక్ మూమెంట్స్‌గా ఉంటాయి. అలాగే అమితాబ్ గారిని బేస్ చేసుకుని కొన్ని ఐటమ్స్ ఉంటాయి. నా కెరీర్‌లో చాలా ఫాస్ట్‌గా.. కేవలం 78 రోజుల్లో ఈ సినిమా తీశానంటే కారణం నిర్మాత విశ్వప్రసాద్‌గారు. ఇంతకుముందు మా కాంబినేషన్‌లో వచ్చిన 'మిరపకాయ్' కంటే మెరుగ్గా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఆగస్టు 15న సినిమాను విడుదల చేస్తున్నాం' అని విశ్వప్రసాద్ తెలిపారు.



సుకుమార్ సతీమణి సమర్పణలో..



రావు రమేశ్ హీరోగా నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో వస్తున్న తొలి చిత్రం ఇది కావడం విశేషం. కంటెంట్ నచ్చడంతో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ ఆదివారం విడుదల చేశారు. 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఎటకారం ఎక్కువున్న సుబ్రహ్మణ్యం భార్యగా ఇంద్రజ, అత్తగారిగా అన్నపూర్ణమ్మ నటించారు. 'మా నాన్న అల్లు అరవింద్' అంటూ గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేసే సుబ్రహ్మణ్యం కొడుకుగా అంకిత్ కొయ్య, అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.



ఆ లోటును భర్తీ చేసేలా...

'నువ్వేకావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలతో పాపులర్ దర్శకుడిగా మారారు కె. విజయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉప శీర్షిక. ఈ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన తారాగణంగా నటించారు. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కె. విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ మధ్య కాలంలో ప్రేమ కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఇది ఆ లోటును భర్తీ చేస్తుంది. ఇంటిల్లిపాదీ చూడదగిన చిత్రమిది. ఉషా అనే అమ్మాయి పెళ్లి చుట్టూ సినిమా కథాంశం సాగుతుంది. మా అబ్బాయి కమల్ కోసం ప్రత్యేకంగా కథ రాసుకుని ఈ సినిమా చేయట్లేదు. ఈ కథకు తను యాప్ట్ కాబట్టే కమల్‌ను హీరోగా ఎంచుకున్నాను. కమల్, కథానాయిక తాన్వీ నటన చాలా సహజంగా.. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ. ఆర్.ఆర్.ధ్రువన్ అద్భుతమైన పాటలు అందించారు. సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీని కూడా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

కాలరెత్తి తిరగరా...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న విడుదలవుతోంది. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. 'శభాష్ సోదరా...కాలరెత్తి తిరగరా...కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు.

ఆకాశంలో ఒక తార

పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రైతు లుక్‌లో దుల్కర్ కనిపించారు. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు.



గుంటూరు-2 నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి మండలంలో ప్రసిద్ధి చెందిన కేఆర్‌కొండూరు మహంకాళీ అమ్మవారిని ఆషాఢమాసం ఆఖరి ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాధవికి దేవస్థానం తరఫున అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి గోత్రనామాలతో పూజ జరిపి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, ఈవో వెంకట రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, పలువురు నాయకులు పాల్గొన్నారు. **(దుగ్గిరాల)**

గంగానమ్మ గుడిలో మొక్కులు తీర్చుకున్న భక్తులు



గంగానమ్మ ఆలయంలో కమిటీ ప్రతినిధులు

తాడేపల్లి టౌన్, జూలై 28: తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్ గంగానమ్మ గుడిలో భక్తులు మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు ప్రతి ఏడాది మాదిరిగానే పోతులను, కోడెలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కోశాధికారి మేకా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వానలు సమృద్ధిగా పడి పంటలు చక్కగా పండాలని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆ గంగానమ్మ తల్లి ఆశీస్సులు అందరి మీద ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చింతా శ్రీరామ్, భీమిరెడ్డి శ్రీని వాసరెడ్డి, ఉండ్రు కల్యాణ్‌కుమార్, తమ్మా నారాయణరెడ్డి, పలగాని శివనాగబాబు, తాడిబోయిన నాగకోటేశ్వరరావు, దొంతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బండి సాంబిరెడ్డి, రాధా, భక్తులు పాల్గొన్నారు.

రచ్చబండ అరుగు ప్రారంభం



ఐనచెరువు కాలనీలో రచ్చబండ అరుగును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు కిరణ్

తుళ్లూరు, జూలై 28: తుళ్లూరు ఐనచెరువు కాలనీలో వేపచెట్టు చుట్టూ కాంక్రీట్‌తో రచ్చబండను నిర్మించారు. దానిని ఆదివారం సాయంత్రం మాజీ ఎంపీటీసీ టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్, జనసేన, బీజేపీ నాయకు లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తూ రెండు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఉద్యమంలో పాల్గొన్న మహిళలు, బీజేపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బండ్ల పట్టయ్య, నాయకులు జమ్ముల అనిల్ గ్రామ పెద్దలు కొమ్మినేని రామాంజనేయులు తదితరులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

30న వైద్య విద్యార్థులకు మెడికల్ పుస్తకాల పంపిణీ

తాడేపల్లి, జూలై 28: తాడేపల్లి మండల, పట్టణ పరిధిలోని వైద్య విద్యార్థులకు ఈనెల 30న దివంగత ప్రముఖ వైద్యులు డీఎస్ఎన్ శర్మ 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం 2023 నీట్ ద్వారా ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరి 2024లో ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న వైద్య విద్యార్థులకు మెడికల్ పుస్తకాల పంపిణీ జరుగుతుందని మారుతీ ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు తెలిపారు. ఒక్కో విద్యార్థికి వారు కోరిన మెడికల్ టెస్ట్ బుక్స్ రూ.10వేల విలువ గలవి ఉచితంగా ఉండవల్లి మారుతీ ఫౌండేషన్ ద్వారా ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అందజేశారన్నారు. వివరాలకు 9494723366, 9985965201లలో సంప్రదించాలని కోరారు.

పాతర్ల నాగయ్య సేవలు మరువలేనివి



పాతర్ల నాగయ్య స్థూపానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

మంగళగిరి, జూలై 28: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాతర్ల నాగయ్య అందించిన సేవలు మరువలేనివని సీపీఐ (ఎంఎల్) నేత మారెళ్ల అంజిరెడ్డి అన్నారు. నాగయ్య వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో ఆదివారం డోలాస్‌నగర్‌లోని స్థూపం వద్ద ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నేతలు కొర్రపాటి ఆదినారాయణ, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నేతలు కూరపాటి కోటేశ్వరరావు, దానబోయిన భాస్కర్, లక్ష్మయ్య, వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో నాగుల్‌మీరా జెండా ఆవిష్కరణ

తాడేపల్లి టౌన్, జూలై 28: మత్స్యకార కుటుంబాలు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కుటుంబాలు క్షేమంగా ఉండాలని నాగుల్‌మీరా జెండాను ఎత్తి కుందూరు జరుపుకుంటామని పోలకంపాడు ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సైకం మల్లేశ్వరరావు తెలిపారు. ఆదివారం సీతానగరం మత్స్యకారుల ర్యాంప్‌లో మల్లేశ్వరం ఆధ్వర్యంలో కుందూరు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి ఆనవాయితీగా నాగుల్‌మీరా జెండా ఎత్తడం కుందూరు జరుపుకోవడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషర్‌మెన్ సొసైటీ కార్యదర్శి బాబు, డైరెక్టర్ సురేష్, సైకం సురేష్, నడకుదురు లక్ష్మయ్య, శ్రీనివాస్, రామరాజు, కొప్పనాతి శంకరరావు, సైకం దుర్గారావు, వెంకటనారాయణ, మహేంద్ర, అప్పారావు, కోటయ్య మత్స్యకారులు పాల్గొన్నారు.

పాఠకుల అభీష్టానికనుగుణంగా పుస్తకాలు ఉంచాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ

వట్టిచెరుకూరు, జూలై 28: గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు వారి అభిష్టానికి అణుగుణంగా పుస్తకాలు అందజేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ సూచించారు. వట్టిచెరుకూరు గ్రామంలోని శాఖ గ్రంథాలయాన్ని ఆదివారం కార్యదర్శి సుబ్బరత్నమ్మ ఆకస్మికంగా తనిఖీ చేస గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు.

సీపీఐ శత వార్షిక వేడుకలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 28: దేశంలో బడుగు, బలహీన, కార్మికవర్గాల, పేదల సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సీపీఐ శత వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం, నందివెలుగు రోడ్డులోని సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద సీపీఐ సివిల్ సప్లయిస్ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరు 26న సీపీఐ 100 సంవత్సరాల్లోకి అడుగుపెడుతుందని, ఈ వ్యవస్థాపన దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

టూ టౌన్ అష్టదిగ్బంధనం

● రెండున్నర గంటల పాటు నాకాబంది
● ముఖ్య ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు
● స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ సతీష్‌కుమార్



నాకా బందీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 28 : పోలీసులు టూ టౌన్‌ను అష్టదిగ్బంధనం చేశారు. ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8:30 గంటల వరకు నగరంలోని వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో నాకాబంది నిర్వహించారు. టూ టౌన్‌లోకి రాకపోకలు సాగించే అన్ని మార్గాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టాభిపురం, అరండల్‌పేట, నగరంపాలెం, నల్లపాడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని గుజ్జనగుండ్ల, బృందావన్ గార్డెన్స్, పట్టాభిపురం స్వామి థియేటర్, చుట్టుగుంట, శ్రీనివాసరావుతోట 60 అడుగుల రోడ్డు, డొంక రోడ్డు, లక్ష్మీపురం మదర్ థెరిసా బొమ్మ సెంటర్, అమరావతి రోడ్‌లోని శ్రీనగర్ జంక్షన్, జేకేసీ రోడ్డులోని ఓరియన్ హోటల్ సెంటర్, ఇన్నర్ రింగ్‌రోడ్ లోని చిల్లీస్ దాబా సెంటర్లలో ఆయా వాహన తనిఖీలు జరిగాయి. తనిఖీలను ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. ఒక్కో సెంటర్లో కనీసం 15 నుంచి 20 మందికి తక్కువ కాకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొద్ది సంవత్సరాలుగా నగరంలో యువకులు ర్యాష్ డ్రైవింగ్, రేస్‌లు, త్రిబుల్ రైడింగ్, డ్రంకన్ డ్రైవ్, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లు పెద్ద సంఖ్యలో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌కుమార్ అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆదివారం నాకా బందీ పేరుతో ఈ తనిఖీలకు ఆదేశాలిచ్చారు. మాదక ద్రవ్యాలు, గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపేందుకు నాకా బందీకి శ్రీకారం చుట్టారు. ఎస్పీ సతీష్‌కుమార్ నాకాబంది కార్యక్రమం నిర్వహించే ప్రతి పాయింట్ వద్ద స్వయంగా పర్యటించి వాహనాలను తనిఖీ నిర్వహించే అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. యువత ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపే వారు, డ్రంకన్ డ్రైవ్ వాహనాలను, ట్రిపుల్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మైనర్లు వాహనాలను నడిపితే తలిదండ్రులదే బాధ్యత అని ఎస్పీ హెచ్చరించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం, అక్రమ క్రయ విక్రయాలకు పాల్పడినా, జిల్లాను మాదకద్రవ్యాల రహిత గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పని చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, వెస్ట్ డీఎస్పీ మహేష్, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ఆనంద్, వెంకట ప్రసాద్, పశ్చిమ నియోజకవర్గంపరిధిలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

286 వాహనాల సీజ్ .. రూ.5,26,900 జరిమానా

ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నగర పరిధిలోని పలు ప్రాంతాలలో జరిగిన 'నాకా బంది' కార్యక్రమంలో భాగం గా మద్యం తాగి వాహనాలు నడపడం, బైక్ రేసింగ్, సరైన పత్రాలు లేని వాహనాలను, ఈవ్‌టీజింగ్, త్రిబుల్ డ్రైవింగ్, పబ్లిక్‌కి ఇబ్బంది కలిగించే వాహనాలను సీజ్ చేసారు. ఈ మేరకు మొత్తం 286 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. 98 వాహనాలకు రూ.5 లక్షల 26 వేల 900 చలనా వేసినట్లు ఆయన వెల్లడించారు. మద్యం తాగి నడుపుతున్న 12 వాహనాలను సీజ్ చేసామన్నారు. ఇక నుంచి నగరంలో ఈ తరహా ఆకస్మిక తనిఖీలు నిత్యం జరుగుతుంటాయని తెలిపారు.

వైభవంగా శ్రీమహంకాళీ అమ్మవారి బోనాలు



అమ్మవారి బోనాల జాతరలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల, జూలై 28: బోనాల జాతరను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ ప్రాంగణం కళకళలాడింది. మండలంలో ప్రసిద్ధి చెందిన కేఆర్ కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో తెలుగుమహిళా విభాగం ఆధ్వర్యంలో బోనాల జాతర నాలుగో ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన సుమారు 400 మంది భక్తులు, దేవస్థానం ఆవరణలో వేసిన టెంట్‌లలో నైవేద్యాలను తయారుచేశారు. ఇంటివద్ద నుంచి ఎలాంటి పూజాసామగ్రి భక్తులు వెంటతెచ్చుకునే అవసరం లేకుండా, ప్రముఖ ఫార్మాసంస్థ బయోఫర్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు అందించిన పొంగలి సామగ్రితో సంప్రదాయరీతిలో కట్టెల పొయ్యిపై అమ్మవారికి పొంగలి నైవేద్యం సిద్ధం చేశారు. కనకతప్పెట్ల మంగలవాయిద్యాలతో వివిధ రకాల అమ్మవారి వేషధారణలతో సాంస్కృతిక నృత్యాలు భక్తులను అలరించాయి. అత్యంత ఉత్సాహంగా కోలాటం ప్రదర్శనలో పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బోనాలను శిరస్సునకెత్తుకుని ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు, మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఐదు మార్లు ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి గాజులు, పూలు, చీరెలు అందించేందుకు క్యూలో నిలుచుని అమ్మ వారిని దర్శించుకుని బోనాలను సమర్పించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయప్రాంగణం కిక్కిరిసి పోయింది. మంచి కలపూడి, కేఆర్‌కొండూరు, చిలువూరు పరిసర గ్రామాలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సుమారు 1000 మంది మహిళలు బోనాల ఉత్సవంలో పాల్గొనడం విశేషం. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తిశ్రద్ధలతో తమ బోనాల మొక్కు తీర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో పలు ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. రంగిశెట్టి జగదీష్‌బాబు కుటుంబసభ్యులతోపాటు టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తోటకూర సీతారామయ్య, యేమినేని కోటేశ్వర రావు, సుంకర బిట్టూ, మాలెంపాటి వెంకటేశ్వరరావు, పోలిమెట్ల రత్నగిరిరావు, అంచే రవిచంద్, కేసంనేని వాసుబాబు, సాదిక్, రంగిశెట్టి సురేష్‌బాబు, దానబోయిన చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ అర్చక సమాఖ్య మండల అధ్యక్షుడిగా వర ప్రసన్నమూర్తి



మండల బ్రాహ్మణ అర్చక సమాఖ్య నూతన కమిటీ సభ్యులను సన్మానించిన అర్చక సంఘం

ఫిరంగిపురం, జూలై 28: మండల బ్రాహ్మణ అర్చక సమాఖ్య అధ్యక్షుడిగా 113 తాళ్ళూరుకు చెందిన అర్చకుడు దివి వర ప్రసన్నమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో మండల బ్రాహ్మణ అర్చక సమాఖ్య మండల సర్వసభ్య సమావేశంలో కమిటీ సభ్యుల ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా చింతలపాటి లక్ష్మీనారాయణశర్మ, కోశాధికారిగా రావూరి పూర్ణ చంద్రశాస్త్రి, కార్యదర్శిగా వల్లూరి రాజేంద్రశర్మ, కమిటీ ఆగమ సలహాదారులుగా చిలకపాటి భరద్వాజాచార్యులు, గడియారం అయ్యన్న శాస్త్రి, సలహాదారులుగా నారాయణ హనుమంతాచార్యులు, కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నారాయణం ప్రసాదాచార్యులు, కమిటీ సభ్యులుగా కంచర్ల వెంకట సత్య నరసింహారావు, పీసపాటి శ్రీనివాసరావు, ఇంకోలు మల్లేశ్వరశర్మ, దేవుపల్లి విశ్వనాథశాస్త్రి, కంచిబొట్ల ప్రసన్నాంజనేయశర్మ ఎన్నికయ్యారు.

పారిశుధ్యం అధ్వానం

● రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
● విజృంభిస్తున్న దోమలు.. వ్యాధులు ప్రబలే ప్రమాదం
● భయాందోళనలో ప్రజలు



1వ వార్డులో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పెదనందిపాడు, జూలై 28 : వేసవి ముగియడం వర్షాకాలం ఆరంభం కావడంతో వ్యాధులు పొంచి ఉంటాయి, గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులు దారి మళ్లడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. దీంతో అధికారులు మురుగు కాలువల్లో పూడిక తీయించకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే పారుతుంది. ఖాళీస్థలాల్లో, మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. అటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇటు మండల కేంద్రంలో ముఖ్యంగా పారిశుధ్య లోపం మురుగు కాలువలు పూడికతీత వంటి పనులు చేపట్టకపోవడంతో దోమలు వృద్ధిచెంది రోగాల బారినపడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం అయినప్పటికీ వర్షాలు కొద్దిపాటిగా కురవడంతో రోడ్లపై నీరు నిలుస్తుందని ఆ నీరు నిలవడంతో మురుగు కాలువల్లో జమ్ము దట్టంగా పెరగడం వల్ల ఆ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో విషపురుగులు తిరుగుతున్నాయని దీనివల్ల ప్రమాదాల బారిన పడుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలే డ్రైడేతో పాటు పారిశుధ్య నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామ స్థాయి అధికారులు మాత్రం ఫోటోలకు ఫోజులిచ్చి పత్రికా ప్రకటనలకే పరిమితం చేస్తున్నారంటూ ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.. వ్యాధుల ప్రభావం తీవ్రం కాకముందే వెంటనే సంబంధిత అధికారులు పారిశుధ్య సమస్యపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మురుగు కాల్వలో దట్టంగా పేరుకుపోయిన జమ్ము

నేడు అండర్-7 రాష్ట్రస్థాయి చెస్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 28: నైట్స్ క్యాస్టల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక అంజనేయపేట, విజేత ఐబీటీ ఫౌండేషన్‌లో అం డర్ -7 బాల, బాలికల విభాగంలో 29వ తేదీన సోమవారం రాష్ట్ర స్థాయి చెస్ ఎంపికలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు అకా డమీ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 తరువాత పుట్టినవారు ఈ పోటీలకు అర్హులని అన్నారు. ఆసక్తి కల్గిన వారు ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరవ్వాలని కోరారు. పోటీల్లో తొలి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8919983849, 7981664035ను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా జిల్లా తైక్వాండో పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 28: స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్-2024 పోటీలు ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్ర, పెదనందిపాడు తహసీల్దార్ కేదార్‌నాథ్ హాజరై పోటీలను ప్రారం భించారు. సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలి కలకు విడి, విడిగా పోటీలను ప్రారంభించారు. పోటీలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.కాశీనాథరెడ్డి మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన క్రీడాకారులు ఆగస్టు 2వతేదీన అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదగా సర్టిఫికెట్స్ అందజేశారు.

సబ్జెక్ట్ టీచర్స్ పోస్టులను భర్తీ చేయాలి

● ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), జూలై 28: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పాఠశాల లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ ఉపాధ్యాయ ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 117 వల్ల పాఠశాల విద్యారంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారం భించిన ప్లస్ 2 పాఠశాలలో రెగ్యులర్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టులు మంజూరు చేయలేదని అన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసి సబ్జెక్టు టీచర్స్ కొరత తీర్చాలని కోరారు.

డాక్టర్ సుమితా శంకర్‌కు బ్లాక్ బక్ అవార్డు

గుంటూరు (మెడికల్), జూలై 28: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్‌కు న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక పయినీర్ రీసెర్చ్ బ్లాక్ బక్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణాశాఖ సహాయ మంత్రి శ్రీహర్ష్ మల్హోత్ర, జల్‌శక్తి మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ అవార్డును ఆమెకు అందజేశారు. బోదకాలు రోగులకు లింఫెడిమాను తొలగించే సర్జరీలు చేసేందుకు వినూత్న పద్ధతుల్లో డాక్టర్ సుమితా చేసిన పరిశోధనలను గుర్తించి ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. బ్లాక్ బక్ అవార్డు సాధించిన ప్లాస్టిక్ సర్జన్ సుమితా శంకర్‌ను నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.

నేడు రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

తుళ్లూరు, జూలై 28: పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. రాజధానిలో 5400 టిడ్కో గృహాలు గత టీడీపీ ప్రభుత్వంలో పేదల కోసం నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని నిర్లక్ష్యం చేసింది. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో టిడ్కో గృహాలకు మౌలిక వసతులు వైసీపీ ప్రభుత్వం కల్పించకుండా కేటాయించిందని, అందులో ఉండే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చర్చించారు. దీంతో మంత్రి నారాయణ స్పందించి అతిత్వరలో మౌలలిక వసతులు కల్పిస్తామని సమాధానం చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి రాజధానిలో కట్టినటిడ్కో గృహాలను అధికారులతో కలిసి ఉదయం 10 నుంచి 11 మధ్యలో సందర్శించనున్నారు.

మేడికొండూరు తహసీల్దారుగా పద్మనాభుడు



పద్మనాభుడు

మేడికొండూరు, జూలై 28: మేడికొండూరు తహసీల్దార్‌గా జి.పద్మనాభుడు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా సాధారణ బదిలీల్లో నెల్లూరు జిల్లా రూరల్ మండలానికి బదిలీ అయిన పద్మనాభుడు ప్రస్తుత బదిలీల్లో గుంటూరు జిల్లా మేడికొండూరు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కేంద్ర బడ్జెట్ బలహీన వర్గాలకు ఆశనిపాతం

● సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి సిటీ, జూలై 28: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, బలహీన వర్గాలకు ఆశనిపాతంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం పిల్లలమర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ ఆసాంతం కార్పొరేట్లకే అనుకూలంగా ఉందన్నారు. పెరుగుతున్న ధరలను తగ్గించే విధంగా కాకుండా పెరిగే విధంగా కేటాయింపులు ఉన్నాయని విమర్శించారు. అమరావతి రాజధానికి ప్రత్యక్ష నిధులు కేటాయించకుండా ప్రపంచ బ్యాంకు నుంచి అప్పులు కేటాయిస్తూ కేంద్రం మోసం చేసిందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మోసాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, దేశంలో ఇండియా కూటమి బలపడుతోందని చెప్పారు. ప్రజా పోరాటాలను విస్తృతం చేసేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, అన్నవరపు ప్రభాకర్, చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వర రావు, తుడిమెళ్ల వెంకటయ్య, వుడతా శ్రీనివాసరావు, మానికొండ డాంగే, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం

ఫిరంగిపురం, జూలై 28 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రైతులకు అన్యాయం జరిగిందని నిరసనగా బడ్జెట్ ప్రతులను రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జీ బాలకృష్ణ తగులబెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్ వలి, సీహెచ్ శ్రీనివాసరావు, కే కోటేశ్వరరావు, నరసింహారావు, రాము, నాగేశ్వర రావు, హనుమంతరావు, ఎం వెంకట్రామయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బడ్జెట్ కాపీల దహనం

తాడేపల్లి / తాడేపల్లి టౌన్, జూలై 28: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద రైతు, కౌలు రైతు, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు నిరసన వ్యక్తం చేస్తూ ఆదివారం బడ్జెట్ కాపీలను దహనం చేశారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ హరితాచౌదరి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరితాచౌదరి

వట్టిచెరుకూరు, జూలై 28: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాగే ప్రాథమిక దశలో వ్యాధులను గుర్తించ డం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆరెకపూడి హరిత చౌదరి సూచించారు. మండలం పరిధి చమళ్ళమూడి గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని శ్రీకృష్ణ మల్టీ స్పెషాలిటి హస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో ప్రముఖ న్యూ రాలజిస్ట్ డాక్టర్ హరితా చౌదరి పాల్గొని వైద్యశిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జూలై 28: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 190 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 338 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 277 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వైభవంగా అద్దంకమ్మవారికి ఆషాఢ బోనాలు



శాకంబరీగా అద్దంకమ్మవారు

తాడికొండ, జూలై 28: ఆషాఢ మాసం సందర్భంగా పొన్నె కల్లులోని అద్దంకమ్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆదివారం పొన్నెకల్లు, పలు గ్రామాల్లో అమ్మవారికి ఆషా ఢం సందర్భంగా బోనాలను మహిళలు సమర్పించారు. కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీన్మార్ తప్పెట్లతో గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారికి చీర, సారెలు తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణాల వద్ద అన్న సమారాధను ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు.

దేవస్థానం వద్ద పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

మంగళగిరి, జూలై 28: అనాథలు, మాతృ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగినేని శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య, ఉపాధ్యక్షుడు సాదరబోయిన నాగేశ్వ రరావు, కార్యదర్శి పేరం పూర్ణచంద్రరావు, కోశాధికారి శివనాగేశ్వరరావు, ఎస్ శివ మ్మ, కృష్ణమ్మ, ముద్రబోయిన రోహిణి తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా బాలాత్రిపుర సుందరి



తెనాలి, మారీసుపేట జూలై 28: శాకాంబరి మాతగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెంలోని అయ్యప్పస్వామి వారి గుడిలో ఆదివారం బాలాత్రిపుర సుందరి మాతకు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ గురుస్వామి దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ గురుస్వామి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి సభ్యులు లక్ష్మికుమారి, శ్రీలక్ష్మి, రాధా, గుడి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యోగా గురూజీ పూర్ణచంద్రరావుకు ఘన నివాళి

తెనాలి, మారీసుపేట జూలై 28: స్థానిక కొత్తపేటలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో ఆదివారం యోగా గురూజీ లింగినేని పూర్ణచంద్రరావు సంతాప సభను ఎస్‌వీ యోగా సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చు అని నిరూపించిన మహా వ్యక్తి అన్నారు. పట్టణంలో వేలమందికి తన యోగా కేంద్రం ద్వారా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంను నేర్పి ప్రజలను ఆరోగ్యవంతులుగా చేసిన గురువన్నారు. కార్యక్రమంలో జెట్టి ఉదయలక్ష్మి, పూర్ణచంద్రరావు, నాగం వెంకటేశ్వరావు, శ్రీరామ్‌మూర్తి, చందు వెంకట్రావు, నాగలక్ష్మి, సోమరౌతు నాగేంద్రయ్య, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట జూలై 28: వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మాగాంధీ శాంతి సేవాశ్రమంలో ఆదివారం ఎస్‌వీ యోగా సభ్యులు నరేంద్రకుమార్ భార్య కీర్తన పుట్టినరోజు సందర్భంగా అత్తయ్య, మామయ్యలు కన్నెగంటి సుశీలదేవి, పిచ్చయ్య కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి, ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ రమణయ్య, సరయు, శ్రీయాల్, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరావు, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

శ్రీఅన్నమాచార్య గృహ సంకీర్తనలు

తెనాలి, మారీసుపేట జూలై 28: స్థానిక గంగానమ్మపేటలో ఆదివారం శ్రీఅన్నమాచార్య గృహ సంకీర్తనా కార్యక్రమాన్ని శ్రీహరినామ సంకీర్తన బృందం తెనాలి వారు నిర్వహించారు. మాదల సాయివెంకట హనుమంతరావు స్వగృహంలో శ్రీహరినామ సంకీర్తన బృందం వారు అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు. పెరవలి వంశీకృష్ణ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అందె బాలచంద్రమౌళి, రాజేశ్వరి, అనితమాధవి, దుర్గామల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రోగులకు పండ్లు పంపిణీ

తెనాలి రూరల్, జూలై 28: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు రోగులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని రోగులకు అల్పాహారం, పండ్లు అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో తెనాలి క్రీడాకారుల ప్రతిభ

తెనాలి అర్బన్, జూలై 28: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో తెనాలి క్రీడాకారులు ప్రతిభ చూపారు. రేపల్లె బౌద్ధ ధర్మ అకాడమీలో జరిగిన సబ్ జూనియర్, క్యాడిట్, మినీ సబ్ జూనియర్ పోటీలలో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండోలో శిక్షణ పొందుతున్న 27మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయా విభాగాలలో దివిజ్ మహిధర్, సత్యజశ్వంత్, నాగచరణ్, హరికవర్మ, సోమశేఖర్, జానకీరామ్, కార్తికేయరెడ్డి, ఆరాధ్య, కృతిక, అభిరామ్‌లు గోల్డ్ మెడల్ సాధించారు. ఆగస్టులో కాన్పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మరో 10 మంది క్రీడాకారులు సిల్వర్ మెడల్స్, ఏడుగురు బ్రాంచ్ మెడల్స్ సాధించారు. అకాడమీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కోచ్ కె.శ్రీనివాసరావు, తైక్వాండో కార్యదర్శి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు నాగరాజు, శామ్యూల్‌రాజు క్రీడాకారులను అభినందించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు శారద

బుర్రిపాలెంలో షుగర్ వ్యాధి వైద్యశిబిరం

తెనాలి అర్బన్, జూలై 28: డాక్టర్ శారదా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి నెలా చివరి ఆదివారంలో భాగంగా డాక్టర్ శారద షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. శిబిరానికి ఉదయాన్నే వచ్చిన రోగులకు పరగడుపు పరీక్షలు చేసి ఆహారం అందించి మళ్లీ పరీక్షలు నిర్వహించారు. షుగర్ తగ్గడానికి ఆరోగ్యంగా ఉండేందుకు పాటించాల్సిన ఆహార నియమాలు, వ్యాయామం వివరించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. నెలకు సరిపడా విటమిన్ టాబ్లెట్లు అందించారు. 200మంది రోగులు సేవలు అందుకున్నారు. సొసైటీ కార్యకర్తలు శిబిరంలో సేవలు అందించారు.



వైద్యులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీనియర్ సిటిజన్స్‌కు ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు

తెనాలి అర్బన్, జూలై 28: స్థానిక కవిరాజా పార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్స్‌కు ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కె.మిధునేశ్వర్‌రెడ్డి శ్వాసకోశ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఊపిరితిత్తుల రక్షణకు పాటించాల్సిన ఆరోగ్య నియామాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, నొప్పులు, అనస్థీషియా అనే అంశంపై వైద్య సలహాలు అందించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వైద్యులను ఘనంగా సన్మానించారు. మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, వెలువోలు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. జూలై నెలలో జన్మించిన సీనియర్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి అర్బన్, జూలై 28: బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఎన్జీవో హోమ్‌లో జరుగుతుందని రాష్ట్ర కార్యదర్శులు వెంకయ్య, వేమయ్య తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ

గుంటూరు(తూర్పు), జూలై 28: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ సాం స్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా కార్య దర్శి వల్లూరి కృష్ణకిషోర్ నిర్వహణలో ఆదివారం త్యాగరాజ కళావేదిక గా సుప్రసిద్ధ గాయకులు జీ అభిరామ బోడె శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. తన సుమధుర గానంతో త్యాగరాజస్వామితో పాటు అనేక వాగ్గేయకారుల కీర్తనలను గానం చేసి సంగీతాభిమానులను అలరిం చారు. వీరికి వయోలిన్‌పై గాయత్రీ విభావరి మృదంగంపై పీఎస్ ఫల్గున్ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ ఉపాధ్యక్షుడు గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ కళాకారులను సత్కరించారు.

సమస్యల నడుమ పొన్నూరు రైతు బజార్

- 13 దుకాణాలు ఖాళీ
- అక్రమంగా అర్జీల వసూళ్లపై ఆరోపణలు
- దుకాణాలు రెన్యూవల్ చేయకపోవటంపై రైతుల ఆవేదన



రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న కూరగాయల దుకాణాలు

పొన్నూరు టౌన్, జూలై 28: పొన్నూరు రైతు బజార్ సమస్యల నడుమ సతమతమవుతోంది. రైతు బజారులో మొత్తం 22షాపులు ఉండగా 13షాపులు ఖాళీగానే దర్శనం ఇస్తున్నాయి. పొన్నూరు పట్టణంలో వినియోగదారుడు ప్రైవేటు కూరగాయల వర్తకుల దోపిడీకి గురవటంతో వినియోగదారుల విజ్ఞప్తి మేరకు 2018లో పొన్నూరు పట్టణంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రైతు బజార్‌ను ఏర్పాటు చేయించారు. రైల్వేస్టేషన్ రోడులో రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఖాళీ స్థలంలో ఈ రైతు బజార్‌ను ఏర్పాటు చేసి 22 దుకాణాలను కూరగాయలు పండించే రైతులకు కేటాయించారు. రెండేళ్ల పాటు రైతులు కూరగాయలు పండించి తక్కువ ధరకు రైతు బజార్‌లో కురగాయలు విక్రయించేవారు. రైతు బజార్‌లో షాపులకు డిమాండ్ పెరిగి నిత్యం టన్నుల సంఖ్యలో కూరగాయలు, ఆకు కూరలు అమ్మకాలు సాగుతూ ఉండేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల స్థానంలో ప్రైవేటు వ్యాపారులు రైతు బజార్‌లో పాగావేశారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కన్నా రైతు బజార్‌లోనే కూరగాయలు అధిక ధరలు చెప్పటంతో వినియోగదారులు రైతుబజార్ వైపు కన్నెతి చూడటం మానివేశారు. దీంతో రైతు బజార్‌లోని దుకాణాలకు డిమాండ్ లేకపోవటంతో దుకాణాలు అన్నీ వరుసగా ఖాళీ అయ్యాయి. అంతేకాకుండా ప్రైవేటు వర్తకులకు రైతులు కాని వారికి డిమాండ్లు ఉన్న షాపులు కేటాయించి కూరగాయలు సాగుచేసే రైతులకు మాత్రం దూరంగా ఉన్న షాపులు కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అద్దె లేకుండానే షాపులు కేటాయించారు. కానీ గత ప్రభుత్వం హయాంలో రైతు బజార్‌లో షాపులకు అద్దెలు వసూళ్లు చేయటంతో రైతులపైనే కాకుండా వినియోగదారులపై కూడా ఆ భారం పడింది. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా రాజకీయ ప్రమేయంతో పొన్నూరు రైతు బజార్‌లో రైతులు తెచ్చే కూరగాయలకు ఆశీలు వసూళ్లు చేయటంతో రైతులపై మరింతభారం పడింది. అంతేకాకుండా ఎస్టేట్ ఆఫీసర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించటం విద్యుత్ వంటి సౌకర్యాలు కూడా కల్పించలేకపోవటంతో రైతు బజారు నానాటికీ ఆదరణ కోల్పోయింది. ఉన్న కొద్దిపాటి రైతులను కూడా వేధింపులకు గురిచేస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దుకాణాలకు కాలపరిమితి ముగిసి రెన్యూవల్ చేయాలని గత నాలుగు నెలలుగా రైతులు ఎస్టేట్ ఆఫీసర్ చుటూ తిరుగుతున్న ప్రయోజనం లేకపోవటంతో ఇటీవల ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ను కలిసి రైతులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు రైతుబజార్‌కు వచ్చి విచారణ చేసి వెళ్లారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకుంటే రైతుబజార్ శాశ్వతంగా మూతపడి కూరగాయల వినియోగదారులకు నష్టం వాటిల్లుతుందని పట్టణ వాసులు వాపోతున్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభానికి సన్నాహాలు

- రూ.9.20 లక్షలతో మరమ్మతులు
- ఆగస్టు 15కి ప్రారంభానికి ఏర్పాట్లు



ప్రారంభానికి సిద్ధం అవుతున్న అన్న క్యాంటీన్

పొన్నూరు టౌన్, జూలై 28: నిరుపేదలు అభాగ్యులకు అతి తక్కువ ధరకు ఆహారాన్ని అందించే అన్న క్యాంటీన్ పునః ప్రారంభానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పురపాలక సంఘం అధికారులు పర్యవేక్షణలో రూ.9.20లక్షల వ్యయంతో క్యాంటీన్ మరమ్మత్తులు నిర్వహిస్తున్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలు, చిరు ఉద్యోగులకు అతితక్కువ ధరకు ఆహారాన్ని అందించేలా అన్న క్యాంటీన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని ఆలపాటి సుబ్బరాయుడు ధర్మసత్రం ప్రాంగణంలో రూ.37లక్షల వ్యయంతో అధునాతన వసతులతో అన్న క్యాంటీన్లు నిర్మించటమే కాకుండా ఇస్కాన్ సంస్థల సహకారంతో పేదలకు రూ.2లకే అల్పాహారం, భోజన వసతులను కల్పించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం ఓటమి చెందటంతో వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసింది. అయితే రాజన్న క్యాంటీన్లు తెరుస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటివైపు కన్నెతి చూడకపోవటంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన అన్న క్యాంటీన్లు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లోపంతో శిథిలమైపోవటమే కాకుండా క్యాంటీన్‌లోని మోటార్లు, విద్యుత్ పరికరాలు, ఇతర వస్తు సామగ్రి సైతం చోరుల పాలయ్యాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని సంకల్పించటమే కాకుండా క్యాంటీన్ల మరమ్మతులకు నిధులు కేటాయించింది. ప్రస్తుతం మరమ్మతుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆగస్టు 10వ తేదీ కల్లా మరమ్మతులు పూర్తిచేసి నూతన రూపురేఖలు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అన్న క్యాంటీన్ అందుబాటులోకి వస్తే చౌక ధరకు నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని చిరుద్యోగులు, దినసరి కూలీలు, సామాన్య నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





దావులూరు సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న కాలినడక వంతెన, పూర్తిగా దెబ్బతిన్న వంతెన అడుగు భాగం




అధ్వానంగా కాలినడక వంతెన

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కొల్లిపర, జూలై 28: మండల పరిధిలోని తూములూరు అడ్డరోడ్డు సమీపంలో బూత్‌మిల్ కాల్వపై ఏర్పాటుచేసిన కాలినడక వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన నిర్మాణం చేపట్టి సుమారు 76 సంవత్సరాలు పైబడి కావడంతో ఎప్పుడు కూలిపోతుందేమోనని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. దావులూరుకు, తూములూరు అడ్డరోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ఈ కాలినడక వంతెన మరమ్మతులకు నోచుకోకపోవడంతో కూలిపోయే పరిస్థితి నెలకొని ఉంది. కాలినడక వంతెనకు ఇరువైపులా ఏర్పాటుచేసిన గోడలు పూర్తిగా నెర్రెలుఇచ్చి దెబ్బతిన్నాయి. శ్లాబ్‌కు ఏర్పాటుచేసిన చువ్వలు కూడా బయటపడ్డాయి. ఈ కాలినడక వంతెన శిథిలావస్థకు చేరుకుందని అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకునే నాధుడు కరువయ్యారని దావులూరు గ్రామస్థులు వాపోతున్నారు. తూములూరు అడ్డరోడ్డు నుంచి దావులూరు, చక్రాయపాలెం వెళ్ళటానికి అతి దగ్గరగా ఉండటంతో ఈ కాలినడక వంతెన ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తరుచూ ఈ వంతెనపై వెళ్ళడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2019వ సంవత్సరం టీడీపీ ప్రభుత్వం హయాంలో దావులూరు నుంచి కాలినడక వంతెన వరకు నూతనంగా రోడ్డు నిర్మాణపనులు చేపట్టారు. 2019వ సంవత్సరం మార్చి నెలలో వెంటనే ఎన్నికల కోడ్ రావటంతో కాలినడక వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కూడా కాలినడక వంతెన నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలినడక వంతెనకు ఒకపక్క గోడ పూర్తిగా దెబ్బతినడంతో ఆ వంతెనపై వెళ్ళాలంటేనే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెన నిర్మాణాన్ని ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సందడిగా విజ్ఞాన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు(విద్య), జూలై 28: ఆనాటి జ్ఞాపకాలు నుంచి నేటి కుటుంబ పరిస్థితుల వరకు పలకరింపులు.. పులకరింతలతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూ నివర్సిటీ పూర్వ విద్యార్థుల సందడికి వేదికయ్యింది. 1997 నుంచి 2023 విద్యా సంవత్సరానికి చెందిన 26 బ్యాచెస్ విద్యార్థులందరూ తమ కుటుంబసభ్యులతో శని వారం విజ్ఞాన్స్ యూనివర్సిటీలో కలిశారు. ఎవరెక్కడ స్థిరపడ్డారో తెలియజేయడంతో పాటు మిత్రులందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వీయ చిత్రాలు, బృంద చిత్రాలు దిగారు. యూనివర్సిటీలో చదివిన రోజులను గుర్తు చేసుకుని ప్రతి ఒక్కరూ కొత్త అనుభూతికి లోనయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థికి కృతజ్ఞతలు తెలియజేశారు. జీవితంలో మీరందరూ వృత్తిపరంగా ఉన్నత స్థానాల్లో స్థిరపడినం దుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మీరందరూ మీ మీ రంగాల్లో ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణం, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్‌పర్సన్ బీ రుద్రమదేవి, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన పూర్వ విద్యార్థులు

ప్రకృతి వనరుల్ని పరిరక్షించుకుంటేనే మెరుగైన జీవనం

● నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

గుంటూరు (విద్య), జూలై 28: ప్రకృతి వనరుల్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నేషనల్ గ్రీన్‌కోర్ కో ఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి సూచించారు. యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జేకేసీ కళాశాలలో ఆదివారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వాతావరణాన్ని పెంపొందించుకోవాలని, అందుకోసం మొక్కల్ని నాటి పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ నాగేశ్వరరావు, డాక్టర్ టీఎన్ వరప్రసాద్, జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.రాహుల్, కె.చరణ్‌చౌదరి,యల్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



దాత ఆలపాటి వెంకటరత్నంకు బాండు అందజేస్తున్న ఈవో త్రినాథరావు

ద్వారకా తిరుమల, జూలై 28: చినవెంకన్న నిత్యాన్న దాన ట్రస్టుకు ఓ దాత రూ.5 లక్షల ను విరాళంగా శనివారం అం దజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఆలపాటి వెంకటరత్నం, శివ నాగేంద్ర ప్రతీ రోజూ తమపేరున అన్నప్రసాద వితరణ జరపాలని రూ.5లక్షలను డీడీ రూపేణా ఈవో త్రినాథరావుకు అందించారు. స్వామి వారి దర్శన అనంతరం బాండు పత్రాన్ని ఈవో అందజేశారు.

డాక్టర్ సుమితా శంకర్‌కు బ్లాక్ బక్ అవార్డు

గుంటూరు (మెడికల్), జూలై 28: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్‌కు న్యూఢిల్లీ లో ప్రతిష్టాత్మక పయినీర్ రీసెర్చ్ బ్లాక్ బక్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణాశాఖ సహాయ మంత్రి శ్రీహర్ష్ మల్హోత్ర, జలశక్తి మంత్రిత్వశాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ అవార్డును ఆమెకు అందజేశారు. బోదకాలు రోగులకు లింఫెడి మాను తొలగించే సర్జరీలు చేసేందుకు వినూత్న పద్ధతుల్లో డాక్టర్ సుమితా చేసిన పరిశోధనలను గుర్తించి ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. బ్లాక్‌బక్ అవార్డు సాధించిన ప్లాస్టిక్ సర్జన్ సుమితా శంకర్‌ను నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆహారం, ఎదుగుదల లోపాలే గుండె జబ్బులకు కారణం

● డాక్టర్ కుప్పా రాజశేఖర్

తెనాలి అర్బన్, జూలై 28 : సరైన ఆహారం అందించకపోవడం, పిల్లల ఎదుగుదలలో లోపాల వలన గుండె జబ్బులు వస్తాయని డాక్టర్ కుప్పా రాజశేఖర్ చెప్పారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో ఆదివారం పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూలైఫ్ చిల్డ్రన్ హాస్పటల్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడుతూ, చిన్నారుల గుండె చికిత్సలు కూడా అధునాతన పరికరాలతో నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ పి.రఘురామ్, డాక్టర్ రాధిక, డాక్టర్ అఖిల్, డాక్టర్ శ్రీనివాసరావులు వైద్య సేవలు అందించారు. మాలేపాటి తిరుమలేశ్వరరావు, హేమంత్, సుధాకర్, రామకోటేశ్వరరావు, పూర్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న ప్రజా సంఘాల కార్యకర్తలు

బడ్జెట్‌పై ప్రజా సంఘాల ఆగ్రహం

తెనాలి అర్బన్, జూలై 28: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీకి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చెంచుపేటలో ఆదివారం బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతులను దహనం చేశారు. సీపీఎం జిల్లా నాయకులు కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని, వ్యవసాయ రంగానికి తగిన నిధులు లేవని, పోలవరంపై స్పష్టత లేకుండా ప్రకటన చేశారని మండిపడ్డారు. బీహార్‌కు 68 వేల కోట్లు కేటాయించి అందుకు అనుగుణంగా రాష్ట్ర కేటాయింపులు లేవన్నారు. ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేర్ల మార్పు హర్షణీయం

● మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్

గుంటూరు, జూలై 28: రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఆ శాఖలో నారా లోకేశ్ నేతృత్వంలో డొక్కా సీతమ్మ, మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం వంటి మహనీయుల పేర్లతో పథకాల పేర్లు మార్చి నూతన ఒరవడి సృష్టించారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ప్రతి విద్యా పథకంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేరు ఉండేదని, జగన్ పేరు పెట్టడానికి ఆయన ఏ విలువలకు ప్రతినిధి అని ఆయన ప్రశ్నించారు. జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా భూ కబ్జాలు జరిగాయని దీనిపై రివర్స్ భూకబ్జా మేళా నిర్వహిస్తే బాగుంటుందని వ్యంగ్యంగా వ్యాఖ్యా నించారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపితే బాధితులకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని విలేకరుల సమావేశం నిర్వహించటం బాధ్యతా రహితమేనని విమర్శించారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జూలై 28: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసి నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగు ల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 190 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 338, నిజాంపట్నం కాల్వకు 277, కొమ్మమూరుకాల్వకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు అండర్-7 విభాగంలో రాష్ట్రస్థాయి చెస్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 28: నైట్స్ క్యాస్టల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక అంజనేయపేట, విజేత ఐబిటీ ఫౌండేషన్‌లో అం డర్ -7 బాల, బాలికల విభాగంలో 29వ తేదీన సోమవారం రాష్ట్ర స్థాయి చెస్ ఎంపికలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు అకా డమీ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 తరువాత పుట్టినవారు ఈ పోటీలకు అర్హులని అన్నారు. వివరాలకు 8919983849, 79816 64035 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.